
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 23.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 151
పేజీలు: 12 వెల: రూ. 5



# మోదీ రికార్డు

8,931 రోజుల పాలనతో మోదీ చరిత్ర సృష్టి

చామ్లింగ్ రికార్డును అధిగమించిన ప్రధాని మోదీ

సీఎం నుంచి పీఎం వరకు నిరవధిక పాలనలో మైలురాయి

మూడోసారి ప్రధాని.. వరుస విజయాలతో మోదీ దూసుకెళ్తూ

09

నెహ్రూ రికార్డుకు సమం.. దేశ రాజకీయాల్లో మోదీ ఆధిపత్యం

ఒక సామాన్య కార్యకర్తగా ప్రయాణం మొదలుపెట్టి.. ఒక రాష్ట్రానికి దిక్సూచిగా మారి.. నేడు దేశ గమనాన్ని శాసిస్తున్న ధ్రువతార ఆయన. అధికారమంటే కేవలం కుర్చీ కాదు.. అది కోట్ల మంది ప్రజల ఆకాంక్షల ప్రతిరూపమని నిరూపిస్తూ.. రికార్డులనే తన చిరునామాగా మార్చుకున్నారు నరేంద్ర మోదీ. గుజరాత్ గడ్డపై మొదలైన ఆ 'ముఖ్య'మంత్రి ప్రస్థానం.. నేడు భారత ప్రధానిగా అప్రతిహతంగా సాగుతూ 8,931 రోజుల మైలురాయిని చేరుకుంది. ఇది కేవలం రోజుల గణన కాదు.. రెండు దశాబ్దాల పాటు ప్రజలు ఆయనపై చూపిన అచంచల విశ్వాసానికి నిదర్శనం. పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును అధిగమించి.. నెహ్రూ విజయాక్షరాలను సమం చేస్తూ, ఆధునిక భారత రాజకీయ యవనికపై 'మోదీ యుగాన్ని' సువర్ణాక్షరాలతో లిఖిస్తున్నారు.

# రైతు సంక్షేమంలో రాజీపడం

## రైతును రాజును చేస్తాం

### ఎన్ని ఇబ్బందులొచ్చినా సంక్షేమ పథకాలు ఆగవు

- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రైతు ఉత్సవ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- రైతుల కోసం ప్రతినెలా రూ.5,500 ఖర్చు
- పంట మార్పిడితో అధిక లాభాలు
- 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొంటాం
- తెలంగాణలో యూరియా కొరత రాకుండా ఉండేందుకు కాంగ్రెస్, బీజేపీలు సహకరించాలి
- ఎంపీలతో కూడిన ప్రతినిధుల బృందాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలి
- సిద్దిపేటలో హరీశ్ రావును ఓడించిన వాళ్లకు మంత్రి పదవి ఇస్తాం

**ముద్ర, సిద్దిపేట :**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల విషయంలో వెనుకంజ వేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో పర్యటించిన సీఎం... అక్కడ నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని జాతికి అంకితం ఇచ్చారు. అనంతరం అక్కడ రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వంటనూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతు ఉత్సవాల పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రైతుల కోసం ప్రతినెలా రూ.5,500 ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. గడిచిన 28 నెలలో దాదాపు లక్ష 40 వేల కోట్లు కేవలం రైతుల కోసం ఖర్చు చేసి రైతును రాజు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ సందర్భంగా రైతుల ఖాతాలోకి 'రైతు భరోసా' నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన ఆయన.. వచ్చే 45 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని తాను నమ్ముతానని చెప్పారు. ప్రజాపాలనలో ఎన్ని సమస్యలు, సంక్షేమానికి ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులు పెటుతున్నా రైతులకు సంబంధించిన సంక్షేమానికి లోటురానివ్వడం లేదని చెప్పారు. మిగతా 2లో



## రైతుకు భరోసా..

రాష్ట్ర వ్యాప్తంగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.9 వేల కోట్ల సాయం

- తొలి విడతలో రూ.3590 కోట్లు
- ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమ

02



# ధరల యుద్ధం

## సామాన్యుడిపై భారం

- క్రూడ్ ఆయిల్ పెరిగితే కూరగాయల దాకా ధరల దెబ్బ
- గ్లోబల్ వార్ ప్రభావంతో సామాన్యుడి బడ్జెట్ కుదేలవుతోంది
- పెట్రోల్ నుంచి పప్పుల దాకా 'ధరల డొమినో ఎఫెక్ట్'
- యుద్ధం లాభం కొందరికి.. నష్టం మాత్రం శ్రమజీవికి
- కరోనా కంటే తీవ్రంగా మారుతున్న ఆర్థిక సంక్షోభం

**ముద్ర డెస్క్ :**
ప్రపంచ పటంలో ఎక్కడో రెండు దేశాల మధ్య యుద్ధం మొదలైతే, అది కేవలం ఆ దేశాల సరిహద్దులకే పరిమితం కాదని నేటి 'గ్లోబల్ విలేజ్' నిరూపిస్తోంది. అక్కడ రష్యా–ఉక్రెయిన్ కావచ్చు, లేదా పశ్చిమ ఆసియాలో రాజుకుంటున్న చిచ్చు కావచ్చు.. తుపాకీ గుండు పేలుతోంది అక్కడైతే, దాని వేడికి కాలిపోతోంది మాత్రం మన సామాన్యుడి జేబే!

**అక్కడి యుద్ధం.. ఇక్కడ ఆగం!**
ఒకప్పుడు యుద్ధం అంటే రాజులు, రాజ్యాల వ్యవహారం. కానీ ఇవాళ యుద్ధం అంటే అది 'ఇంటింటా వార్'. గ్లోబలైజేషన్ పతాక స్థాయికి చేరిన ఈ రోజుల్లో, ఒక మూల జరిగే విలయం మరొక మూల ఉన్న సామాన్యుడి కంచాన్ని ఖాళీ చేస్తోంది. మిగతా 2లో

## అణు కేంద్రాలే లక్ష్యం

### వినాశనం అంచున ప్రపంచం!

- నటాంజ్ ప్లాంట్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడి
- డిమోనాపై క్షిపణుల వర్షం కురిపించిన ఇరాన్
- 48 గంటల అల్టిమేటం జారీ చేసిన అమెరికా
- పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

పశ్చిమాసియాలో దాడుల వ్యూహం పూర్తిగా మారిపోయింది. ఇన్నాళ్లూ ఆర్థిక మూలాలైన ఆయిల్ కేంద్రాలు, రక్షణ వ్యవస్థలైన ఆర్మీ స్థావరాలను టార్గెట్ చేసిన శక్తులు.. ఇప్పుడు నేరుగా అణు ప్లాంట్లపై దాడులకు దిగుతున్నాయి. ఈ అణు యుద్ధ మేఘాలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక, భౌగోళిక పరిస్థితులను అతలాకుతలం చేసే ప్రమాదం పొంచి ఉంది.




## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో మేలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



- లక్ష్మీపురం స్కూల్ పనుల పరిశీలన
- వేగం పెంచాలని అధికారులకు ఆదేశం

03

## అక్కా.. అన్నా.. ఏట్లా ఉన్నారు..?

మంత్రి అడ్లూరి పలకరింత



- ఎనుగుమట్లలో ప్రజలతో కలిసిపోయిన మంత్రి
- వార్డు సమస్యలను విన్నవించిన స్థానికులు..

06

## బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు

హై-రైజ్‌కు కొత్త నిర్వచనం



- టీడీఆర్ వినియోగంపై కఠిన నిబంధనలు
- అదనపు అంతస్తులకు గ్రీన్ సిగ్నల్
- సెట్‌బ్యాక్‌లకు సడలింపులు
- నిర్మాణంలో పారదర్శకత పెంపు ఉత్తర్వులు జారీ

09

## సోషల్ మీడియాకు స్వీయ నియంత్రణే మేలు

ప్రముఖ వెబ్ సైట్ ది వైర్ వ్యవస్థాపక సంపాదకులు ఎంకే వేణు

02

- ప్రభుత్వ జోక్యంకంటే స్వీయ నియంత్రణే సోషల్ మీడియాకు శ్రేయస్కరం
- సోషల్ మీడియా వేగం పెరిగినా బాధ్యత కూడా పెరగాలి
- విజయవాడ ఐజేయూ ప్లీనరీకి ముందు హైదరాబాద్‌లో జాతీయ సదస్సు
- టెక్నాలజీ వినియోగంలో జాగ్రత్తలు అవసరం: జర్నలిస్టులకు సూచనలు
- సోషల్ మీడియాతో వార్తల పంపిణీ విధానంలో విప్లవాత్మక మార్పులు




## పేదల కోసం బఫర్ జోన్లు..

# ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లా?

03

హైడ్రా రంగనాథ్ పై నిప్పులు చెరిగిన కేంద్రమంత్రి బండి సంజయ్





## ₹10 లక్షలు దాటితే పాన్ తప్పనిసరి

### ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు

10

- పెద్ద మొత్తాల లావాదేవీలపై కేంద్రం కఠిన నిబంధనలు
- నగదు జమలు, కొనుగోళ్లలో పాన్ తప్పనిసరి చేయాలని నిర్ణయం
- పారదర్శకత కోసం లిమిట్ల పెంపు –సీబీడీటీ కీలక మార్పులు
- బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, వాహన కొనుగోళ్లపై కొత్త రూల్స్




## దురంధర్ -2కు బ్రహ్మరథం


09

### దేశవ్యాప్తంగా హౌస్‌ఫుల్ షోలు

- విమర్శల మధ్య కలెక్షన్ల సునామీ
- మూడు రోజుల్లోనే ఈ చిత్రం రూ. 500 కోట్ల గ్రాస్ వసూళ్లు
- బాక్సాఫీస్ వద్ద రికార్డులు
- జనాలు ఎగబడి చూసేంతగా ఇందులో ఏముంది?




## ఇదీ ఏఐ ముద్ర






వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. ఇక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తాను : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.03.2026
www.mudranews.in | @mudranews



కారుకు రెగ్యులర్ సర్వీసింగ్ చేయండి




కారు పనితీరు మెరుగ్గా ఉండేందుకు సమయానికి సర్వీస్ చేయడం చాలా ముఖ్యం.

# రైతు సంక్షేమంలో రాజీపడం

(మొదటి పేజీ తరువాయి)

**పంట మార్పిడి అవసరం ఉంది**

రాష్ట్రంలోని పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రాంతం నిజాం కాలంలోనే వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగా ఉండేది. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు ఆకుకూరలు బాగా పండించేవారు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం తో రంగారెడ్డి జిల్లాలో పంటల సాగు తగ్గిందన్నారు. దాంతో కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పంటల మార్పిడి జరగాల్సిన అవసరం ఉందని ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రైతులను లాభసాటిగా చేసేలా అవసరమైతే ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం, మోడీతో మాట్లాడుదామన్నారు. అయిల్ పామ్ పరిశ్రమ లాభసాటిదన్నారు. ప్రతిపంట సాగులో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో ఒక్కో జిల్లా ఒక్కో పంటకు ప్రసిద్ధి. రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయి. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల యూరియా కొరత ఏర్పడే సమస్య ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో తయారవుతున్న యూరియా మొత్తం మనకే ఇవ్వాలి. యుద్ధం కారణంగా తెలంగాణలో యూరియా కొరత రాకుండా ఉండేందుకు కాంగ్రెస్, బీజేపీ ఎంపీలతో కూడిన ప్రతినిధుల బృందాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలని దీన్ని మంత్రి తుమ్మల సమన్వయం చేయాలన్నారు.





**మహిళలకు ప్రాధాన్యత**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించామన్నారు. మహిళల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రిగా అహర్నిశలు నేను కష్టపడతాననీ మహిళలు ఎదిగితే తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఎకనమిగా ఎదుగుతుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళలకు అర్థ భాగస్వామ్యం వచ్చినప్పుడే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందన్నారు.

**తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తాం**

విద్యాకమిషన్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు రాబోయే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి విద్యను అందించేలా రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా చేయిస్తామని అందువల్ల ప్రైవేట్ స్కూల్ మోజులో పడి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దన్నారు. 18 వేలకు పైగా ఉన్న స్కూళ్లను ప్రక్షాళన చేసే బాధ్యత నాదేననిచెప్పారు. సాంకేతిక నైపుణ్యం వైపు మనం మళ్లాలన్నారు.

**2029లోనూ కాంగ్రెస్ దే అధికారం..!**

2029లోనూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేటలో కాంగ్రెస్ గెలవాలని ఆకాంక్షించారు. సిద్దిపేటలో గెలిచి ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పోటీ పడింది. కానీ ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చారన్నారు. 2023లో మాకు అధికారం ఇచ్చారనీ. 2029 మళ్లీ మాకే అధికారం ఇవ్వబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

**ఒక్కసారి అవకాశం ఇవ్వండి**

సిద్దిపేటను 1984 నుంచి 2029 ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని సీఎం అన్నారు. మార్పు చేసి చూస్తే మంచి జరుగుతుందో మీరే చూడాలన్నారు. మల్లన్నసాగర్, ఏటిగడ్డ కిష్టాపూర్ వంటి సమస్యలు వచ్చిన నాడు మేము నిలబడ్డామని ఈ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ వ్యవహరించినట్లు మేము వ్యవహరించడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామన్నారు. మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం, ప్రజల మేలు కోసం మాట్లాడాలి. కానీ ఏమి జరగవద్దు వీళ్లను ఏమీ చేయనివ్వొద్దు అంటే అది ప్రజల పట్ల పగతో వ్యవహరించినట్లేనన్నారు. ప్రతిపక్షం బాధ్యత ఇది కాదన్నారు. అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్ధిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్ధిపేటకు వస్తామన్నారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో భిన్నాభిప్రాయాలు**

ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే నా దృష్టి అని సీఎం చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ వారి నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ మా నిజాయితీ నిరూపించుకున్నామన్నారు. నర్మెట్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు నేను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయి. కావాలనుకుంటే నేను ఈ ఫ్యాక్టరీని కొడంగల్ కు తీసుకువెళ్లకపోయేవాడినా? కానీ ఇక్కడి రైతుల కోసం ఇక్కడే నిర్మించాం. ఆ తర్వాతే తన నియోజకవర్గానికి ఒకటి ఇవ్వమని మంత్రులను కోరుతున్నానని చెప్పారు. నేను వివక్ష చూపడంలేదన్నారు. వివక్ష గురించి మాట్లాడితే 2014 నుంచి 2023 వరకు కొడంగల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారు? మేమొచ్చాక ఈ ప్రాంతానికి నేను ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు తీద్దామన్నారు. వివక్ష మా ఇంట వంట లేదన్నారు. బీఆర్ఎస్ నేతలను చూసి చూసి ప్రజలను వేయమన్నారు. పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం మేము పని చేయామన్నారు. నాకు వ్యవసాయం తెలుసని చీడపురుగులకు ఏ మందు వేయాలో తనకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి. ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, ఎం. రఘునందన్ రావుతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతుకు భరోసా..

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో పెట్టుబడి సాయం కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న రైతులకు భారీ శుభవార్త అందింది. రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిలీజ్ చేశారు. మొత్తం 3 విడతల్లో రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తొలి విడతలో భాగంగా రూ.3590 కోట్లను.. ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమ కానుంది. ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం రోజున రైతుల అకౌంట్లలో డబ్బులు పడనున్నాయి. ఈ రైతు భరోసా పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.50 కోట్ల ఎకరాలకు రూ.9 వేల కోట్లను రేవంత్ రెడ్డి సర్కార్ అందించనుంది. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట గ్రామంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం తర్వాత నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను రిలీజ్ చేశారు. తొలి విడతలో భాగంగా రూ. 3,590 కోట్లను విడుదల చేసినట్లు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులు ఉన్నారని.. వారిలో ఒక ఎకరం వరకు సాయం అందేలా రూ. 3,590 కోట్లను విడుదల చేశారు. ఇక 20 రోజుల తర్వాత రెండో విడత రైతు భరో సా నిధుల్లో భాగంగా మరో రూ.2,650 కోట్లు.. ఆ తర్వాత 25 రోజులకు మూడో విడతలో మిగిలిన రూ.2,760 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో ఉన్న మొత్తం 24.32 లక్షల మంది రైతులకు ఎకరం వరకు.. 48.68 లక్షల మందికి ఎకరం కంటే ఎక్కువ భూములు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు. రైతులకు పెట్టుబడి సాయం కోసం.. రైతు భరోసా పథకం కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం 2 విడతల్లో ఎకరాకు రూ.6 వేల చొప్పున.. సంవత్సరానికి రూ. 12 వేల చొప్పున రైతులకు సాయం అందిస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్ ఎన్నికల హామీ సందర్భంగా ఈ రైతు భరోసా కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ.. ఇంకా పెంచలేదు.

# ధరల యుద్ధం



(మొదటి పేజీ తరువాయి)

**క్రూడ్ ఆయిల్ చిచ్చు**

ఆయిల్ ధరలు పెరిగితే అది కేవలం పెట్రోల్, డీజిల్‌కే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరిగి, పొలంలో పండే కూరగాయ నుంచి ఫ్యాక్టరీలో తయారయ్యే సబ్బు వరకు ప్రతి దానిపై 'ధరల శరాఘాతం' దిగుతోంది.

**గుండు సూది నుండి గ్యాస్ వరకు**

ఇంధన ధరల పెరుగుదల ఒక గొలుసుకట్టు చర్య లాంటిది. పప్పులు, ఉప్పులు, వంట నూనెలు.. ఇలా జాబితా ఏదైనా సరే, సామాన్యుడు "కొనే తట్టు లేడు.. తినే తట్టు లేడు" అన్నట్టుగా మారింది పరిస్థితి.

**కరోనాను మించిన సంక్షోభం?**

మనం ఒకప్పుడు కరోనా చూసి వణికిపోయాం. కానీ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం అంతకంటే ప్రమాదకరంగా మారుతోంది. కరోనా సమయంలో కనీసం 'మనం బతికితే చాలు' అనుకున్నాం. కానీ ఈ యుద్ధ సంక్షోభం బతికున్న వాడిని బతకనివ్వడం లేదు. గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడి స్థాయిని దాటిపోతుంటే, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి."యుద్ధం మానవత్వానికి ఓటమి.. కానీ వ్యాపారానికి వేట!" ఏ ఒక్క మానవతావాది ఈ రక్తపాతాన్ని కోరుకోడు. కానీ ఆయుధాలు అమ్మే వాడికి లాభం, నిత్యావసరాలను బ్లాక్ చేసే వాడికి లాభం.. నష్టపోయేది మాత్రం శ్రమజీవి మాత్రమే.

**మనం ఎటువైపు?**

ప్రపంచ దేశాలు సంకుచిత ప్రయోజనాల కోసం యుద్ధ ట్యాంకులను ముందుకు నడిపిస్తుంటే, మధ్యతరగతి మనిషి తన బడ్జెట్ చక్రం ఎలా తిప్పాలో తెలియక సతమతమవుతున్నాడు. ఈ యుద్ధం ఆగేది ఎప్పుడు? ధరల మంట చల్లారేది ఎప్పుడు? ఇది కేవలం దేశాధినేతల చర్చలతో ముగిసేది కాదు.. మానవీయ కోణంలో ఆలోచించి, ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించే దిశగా అడుగులు పడాల్సిన సమయం ఆసన్నమైంది.

# సోషల్ మీడియాకు స్వీయ నియంత్రణే మేలు

**ముద్ర న్యూస్ బ్యూరో**

**హైదరాబాద్, మార్చి 22:** సోషల్ మీడియా నియంత్రణ పేరుతో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం పెద్ద ప్రమాదకరమని, ఈ ప్రమాదానికి ఆస్కారం ఇవ్వకూడదని, సోషల్ మీడి యా స్వీయ నియంత్రణకు ఒక అసోసియేషన్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రముఖ వెబ్ సైట్ ది వైర్ వ్యవస్థాపక సంపాదకులు ఎం.కె.వేణు సూచించారు. సోషల్ మీడియాకు స్వీయ నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు. ఈనెల 27-29 తేదీలలో' విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ ప్లీనరీని పు రస్కరించుకుని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూ డబ్ల్యూ జే ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఇండియా (మెఫి) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, బషీర్ దేశోద్ధారక భవన్ 'సోషల్ మీడియా – మంచీ–చెడూ' అనే అంశం పై ఆదివారం జాతీయ సదస్సు నిర్వ హించారు. ఈ సదస్సుకు సీనియర్ పా త్రికేయులు సోమశేఖర్ అధ్యక్షత వహించగా, ఎంకే వేణు కీలకోపన్యాసం చేశారు. మెఫీ మేనేజింగ్ ట్రస్టీ, ఐజేయూ మాజీ అధ్యక్షులు డి. అమర్ స్వాగతోపన్యాసం చేశారు. టీయూడబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షులు,కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి. యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్ కుమార్ తో పాటు పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.కె.వేణు మాట్లాడుతూ ప్రస్తుత యుద్ధ వార్తలను సిఎన్ బిబిసి , అల్ జజీరా కంటే వేగంగా ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా అందుతున్నాయన్నారు. సోషల్ మీడియా రాకతో వేగం పెరిగిందని, వార్తలను వెంటనే మరిం త వేగంగా అందజేసేందుకు అవకాశం లభించిందని, వార్తల శైలిలోనూ మార్పు వచ్చిందని వివరించారు. సోషల్ మీడియా డిస్ట్రిబ్యూషన్ ప్లాట్ ఫామ్ ఉపయోగపడుతుందని, ఇంటర్ రాకతో మీడియా ప్రజాస్వామీకరణ జరిగి ఏకపక్ష ఆధిపత్యానికి తెరపడిందని తెలిపారు. నరేం ద్ర మోదీ ప్ర ధాని కాకముందు ప్రధానమంత్రుల కార్టూన్లు కనిపించేవని, ప్రస్తుతం దేశంలో అలాం టి పరిస్థితి లేదన్నారు. మీడియాలో ఏకఛత్రాధిపత్యం దిశగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో జర్నలిస్టుల పోరాటం కంటే , సమాజంలో వ్యక్తులు ఒకరితో ఒకరు చర్చించుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన పెంచుకుంటూ కొత్త స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఒక జర్నలిస్ట్ ఒక దగ్గర కూర్చొని చేసిన స్టోరీ క్షణాల్లో ప్రపంచం మొత్తం వెళ్తుందని, ఒకప్పుడు ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్స్ డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్ళని, ఇప్పుడు ట్విట్టర్, ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్ యూట్యూబ్ లాంటి డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నాయని వివరించారు. యూపీ ఎన్నికల్లో సోషల్ మీడియా ద్వారా బిజెపి ప్రతి వ్యక్తికీ దగ్గరయిందన్నారు. టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలనే అంశం తెలుసుకోవాల్సిన అవసరం యువతకు ఉన్నదని, సరైన విధానంలో తెలుసుకోకపోతే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధాని మన్ కి బాత్ పేరుతో సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరికి వాళ్ళు తమకు నచ్చిన విషయాలు రాస్తున్నారని, మాట్లాడుతున్నారని తెలిపారు.










# ఉగాది పురస్కారం అందుకున్న వాకిటి రామ్ రెడ్డి


**ముద్ర , రామన్నపేట :**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. కూరెళ్ల విఠలాచార్య గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, చేయూత ఫౌండేషన్ చైర్మన్, ఆత్మీయ భారతి సాహిత్య సేవ సంస్థ అధ్యక్షుడు వాకిటి రామ్ రెడ్డి ఉగాది పురస్కారం అందుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ కునూరు లక్ష్మణ్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరై, వారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జస్టిస్ కునూరు లక్ష్మణ్ మాట్లాడుతూ, వాకిటి రామ్ రెడ్డి కవిత్వంపై మంచి పట్టు కలిగి ఉండటంతో పాటు, తన గాత్రంతో శ్రోతలను ఆకట్టుకునే సామర్థ్యం ఉన్న కవిగా ప్రశంసించారు. ఆయన సాహిత్య సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య, జిరసం అధ్యక్షుడు సభా సమ్రాట్ పోరెడ్డి రంగయ్యతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు కవులు, కవయిత్రులు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా సాహిత్య రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా వాకిటి రామ్ రెడ్డికి ఈ పురస్కారం అందజేయడం విశేషంగా నిలిచింది.



# క్రీడలతో మానసిక వికాసం

## రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

క్రీడలతో మానసిక వికాసం పెంపొందుతుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. భువనగిరి పార్లమెంట్ వ్యాప్తంగా ఇటీవల పీఎం సంసద్ ఖేల్ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేయడానికి ఆదివారం జూనియర్ కళాశాల మైదానంలో సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేశానికి యువత నిర్మాణాత్మకంగా పనిచేయుటకు ఉపయోగపడతాయన్నారు. పీఎం సంసద్ ఖేల్ మహోత్సవంలో యువత పెద్ద ఎల్లున పాల్గనడం సంతోషకరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టి క్రీడలను ప్రోత్సహించడంతో యువతలో విశ్వాసం పెంపొందుతుందన్నారు. క్రీడల వల్ల ఫిట్ ఇండియా శరీరము ఆత్మ శుద్ధి చెందుతుందన్నారు. క్రీడల వల్ల వికసిట్ భరత్ లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. గెలుపొందిన వారికి గవర్నర్ బహుమతులు అందజేశారు. ముందుగా గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బూర నర్సయ్య గౌడ్, గూడూరు నారాయణ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, అధ్యక్షులు రత్నపురం బలరాం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 25న కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జగిత్యాల రాజకీయాల్లో కీలక మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. మార్చి 25న తన పదవికి, పార్టీ సభ్యత్వానికి స్వస్తి చెప్పనున్నట్లు కార్యకర్తలకు రాసిన లేఖలో వెల్లడించారు.గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ జెండాను మోసిన ఆయన, గత కొంతకాలంగా పార్టీలో ఎదురవుతున్న అవమానాలు, ప్రాధాన్యం లోపం కారణంగా తీవ్ర అసంతృప్తికి గురయ్యానని తెలిపారు. ముఖ్యంగా తన ప్రత్యర్థి సంజయ్ కుమార్‌ను పార్టీలో చేర్చుకుని ప్రాధాన్యం ఇవ్వడం తనను కలిచివేసిందని పేర్కొన్నారు.ఆయనను ఆపేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేసిన బుజ్జగింపులు ఫలించలేదు. గౌరవం లేని చోట కొనసాగడం ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఇకపై తన రాజకీయ భవిష్యత్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.జీవన్ రెడ్డి నిర్ణయం జిల్లాలో రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముండగా, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఆయనపై కన్నేసినట్లు సమాచారం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## కారుకు టైర్ ప్రెషర్ చెక్ చేయండి..

సరైన గాలి ఒత్తిడి ఉంటే మైలేజ్ పెరుగుతుంది, ప్రమాదాలు తగ్గుతాయి.





### ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

# దార్శనిక దేవాలయాలు

- లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

**ఖమ్మం, ముద్ర:**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్య కోసం పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలను నిర్మించడం కోసం పెట్టే పెట్టుబడిగా ఆయన అభివర్ణించారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన భట్టి.. బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న భవన సముదాయాలను కలియతిరుగుతూ ఆయన పరిశీలన చేశారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్, అడ్మినిస్ట్రేటివ్ భవనాల నిర్మాణాన్ని పరిశీలించిన విక్రమార్క. మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాలను పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దు అని ఆయన చెప్పారు. ఇవి కేవలం భవనాలు కాదు రేపటి తరాలను ఉజ్వలంగా నిర్మించే దార్శనిక దేవాలయాలుగా ఆయన అభివర్ణించారు.

## పేదల కోసం బఫర్ జోన్లు..

# ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లా?

- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి ఫైర్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్ర ప్రభుత్వం ధ్వంధ్వ వైఖరితో వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ ఎంఐఎం పార్టీకి చెందిన నేతల ఆక్రమణలను మాత్రం వదిలేస్తోందని ధ్వజమెత్తారు. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ను బండి సంజయ్ ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఇంటర్వ్యూలో రంగనాథ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ గరీంబోంకో హటావో-ఒవైసీకి బచావో అన్న చందంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లు, పేదలకు ఫుల్ ట్యాంక్ లెవల్, ఒవైసీకి మాత్రం ఫుల్ థ్యాంక్ లేవల్ అనేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ లాజిక్ ఎలా ఉందంటే విద్యార్థులు అక్రమ కాలేజీలో చదివితే అది సామాజిక కోణం, పేదల ఇళ్లు మాత్రం ఆక్రమణలు అంటూ కూల్చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 200లకు పైగా పేద కుటుంబాల ఇళ్లపైకి మెరుపు వేగంతో కదిలిన హైడ్రా బుడ్డోజర్లు సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ లో ఉన్న ఓవైసీ కాలేజీ విషంలో మాత్రం జాప్యం చేస్తోందన్నారు. ప్రధాని మోదీ పీఎంఏవై ద్వారా పేదలకు గౌరవప్రదమైన నివాసాలు నిర్మిస్తుంటే కాంగ్రెస్ మాత్రం బుల్డోజర్లను పంపిస్తోందని విమర్శించారు. చట్టం రజాకార్ వారసుల కోసం వంగి, పేదలపై మాత్రం విరుచుకుపడితే అ దిపాలన కాదని బలహీనమైన సమర్ధన మాత్రమేనని విమర్శించారు.



### దోచేయాలని చూసి..

# నీతిమాటలా..?

- ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ముద్ర, వనపర్తి :**
వనపర్తి చరిత్రలో అవినీతిపరుల నుంచి వనపర్తిని కాపాడుకునేందుకే ప్రజలు తీర్పునిచ్చారని తూడి మేఘారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెబ్బేరు సంత స్థలాన్ని కాపాడుకుంటామని అన్నారు. 392 సర్వే నెంబర్లు 15 ఎకరాలు, సర్వేనెంబర్ 405 లో 15 ఎకరాలు మొత్తం 30 ఎకరాల 19 గుంటలు వేణుగోపాల స్వామి దేవుడికి దూపదీప నైవేద్యాల కోసం కేటాయించబడిందని, ఆ భూమిని కొందరు ఖాజేయాలని చూశారని విమర్శించారు. సంత స్థలానికి సంబంధించి 30 సంవత్సరాల నుంచి దేవదాయ శాఖ కోర్టును ఆశ్రయించిందని ఇంకా దేవదాయ శాఖకు మధ్యల ఇందుకు సంబంధించిన సమస్య కొనసాగుతూనే ఉందని ఆయన అన్నారు. సంత స్థలాన్ని కాపాడుకుంటామని, అందులో ఎవరి చేయి పెట్టకుండా చూస్తామని ఎమ్మెల్యే అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత 2024 లో సంతస్థలం సంత కెటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి లెటర్ రాశారని ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ మంత్రి కూడా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసి ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ క్రమంలో పొజిషన్ను పూజారులే ఉంటే దేవదాయ శాఖతో మాట్లాడి ఇందుకు సంబంధించిన సమస్యను పరిష్కరించేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, టీపీసీసీ జర్నల్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, తిరుపతయ్య, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వల్లే..

## రాష్ట్రం అప్పులపాలు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ముద్ర, యాదాద్రి భువనగిరి :**
రాష్ట్ర అభివృద్ధిపై దూరదృష్టి, విజన్ లేక ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసిన మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థికంగా నాశనం చేశారని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో డిసిసి నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చేసిన అప్పులతోనేటికీ రూ.6500 కోట్ల వడ్డీలు చెల్లించాల్సి వస్తుందన్నారు. 10 ఏళ్లు పరిపాలించి 8 లక్షల కోట్ల రూపాయల అప్పుడు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి తోశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తే అవకాశాలు వాటి అంతట అవే వస్తాయన్నారు. భారతదేశ నిర్మాణంలో రాహుల్ గాంధీ కుటుంబం కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ నిర్మాణంలో బిజెపి నాయకుల కుటుంబ సభ్యుల పాత్ర ఎక్కడ ఉందని ప్రశ్నించారు. కొద్దో గొప్పో సావర్కర్ గురించి చెప్పుకుంటే బ్రిటిష్ వారి కాళ్ళ వద్ద మోకరిల్లిన సంఘటనలు మాత్రమే ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 40వేల ఉద్యోగాలకు మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 67 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో పేద ప్రజలకు అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. అర్హులైన పేద కుటుంబంలో కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ బంద్రు శోభారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ లు పాల్గొన్నారు.

# మూసీకి బీజేపీ వ్యతిరేకం కాదు

- పేదల ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకం
- అక్రమ కట్టడాలపై చర్యలేవి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని తెలంగాణ బీజేపీ చీఫ్ రామచంద్రరావు స్పష్టం చేశారు. కానీ.. పేదల ఇళ్లను కూలగొట్టడాన్ని ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటామని తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఆదివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రూ.7000 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడమే కాకుండా.. పేదల ఇళ్లను కూలగొట్టడం సరికాదన్నారు. దీనిని ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటామన్నారు. మూసీ పక్కన ఉన్న అక్రమ కట్టడాలపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. పేదల పక్షాన ఎవరూ లేరని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. హైదరాబాద్ నగరం సుందరీకరణ కావాలి కానీ.. అది పేదల ఇళ్లను, వారి జీవితాలను దెబ్బతీసేలా ఉండకూడదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి ఏమీ ఉండదని, అంతా అవినీతే కనిపిస్తోందన్నారు. కేసీఆర్ రూ.లక్షన్నర కోట్లతో కాళేశ్వరాన్ని నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి దానిని మూసేశ్వరంగా మారుస్తున్నారని విమర్శించారు. చివరికి తెలంగాణను అభివృద్ధి చెందకుండా మూసేస్తారని దుయ్యబట్టారు.ఇక ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లో ఇరిగేషన్ రంగ నిపుణులు వెదిరె శ్రీరామ్ ప్రజల ఇళ్ల కూల్చివేతలపై కొన్ని ప్రత్యామ్నాయాలను వివరించారు. మూసీనదిలో కాలుష్యం, డ్రైనేజీ వ్యర్థాలు కలవకుండా శుద్ధిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మూసీనీటి నుంచి రైతులు స్వచ్ఛమైన పంటలను పండించినపుడు మూసీ పునరుజ్జీవం సక్సెస్ అయినట్లుగా భావించాలన్నారు. సిటీ ఏరియాలో మాత్రమే శుద్ధి చేస్తే పైనుంచి వచ్చే సీవరేజ్ అంతా ఎక్కడికి పోతుందన్న ఆలోచన లేకుండా ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు.

# పత్రిక స్వేచ్ఛను హరించడమే

- యూఎన్ ఐ కార్యాలయం సీజ్‌పై ఐజేయూ ఆగ్రహం

**ముద్ర, న్యూఢిల్లీ/చండీగఢ్:**
యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూ ఎన్ ఐ) కార్యాలయాన్ని బలవంతంగా సీజ్ చేసి స్వాధీనం చేసుకోవడంపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మార్చి 20 సాయంత్రం న్యూఢిల్లీలోని రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ ఐ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశాల పేరుతో స్వాధీనం చేసుకున్న తీరు దిగ్భ్రాంతిని కలిగించిందని ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్వీందర్ సింగ్ జమ్ము శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు, ల్యాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ అధికారులు వ్యవహరించిన తీరు దేశంలోని జర్నలిస్టులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. ఇది దేశంలో పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని, ప్రజాస్వామ్యంలో నాల్గో మూల స్తంభంగా భావించే మీడియాకు అవమానకరమని వారు పేర్కొన్నారు. సిబ్బందికి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, వారి వ్యక్తిగత వస్తువులు తీసుకునే అవకాశం ఇవ్వకుండా ఈ చర్యను అమలు చేయడం బాధాకరమని ఐజేయూ నాయకులు తెలిపారు. సాధారణ పరిపాలనా ప్రక్రియలా కాకుండా, ఇది పోలీసు దాడి మాదిరిగా సాగిందని విమర్శించారు. ఈ చర్య సందర్భంగా మహిళా జర్నలిస్టులను తోసివేసినట్లు వచ్చిన సమాచారం, దృశ్యాలు తీవ్రంగా కలవరపరుస్తున్నాయని వారు పేర్కొన్నారు. పోలీసుల ప్రవర్తనపై సమగ్ర దర్యాప్తు జరిపి, జర్నలిస్టుల గౌరవం, భద్రతకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన విశ్వసనీయ వార్తా సంస్థలలో యూఎన్ ఐ ఒకటని, దశాబ్దాలుగా ఢిల్లీలోని ఈ కార్యాలయం సజీవ వార్తా కేంద్రంగా పనిచేస్తోందని ఐజేయూ గుర్తుచేసింది. అర్ధరాత్రి సమయంలో కార్యాలయాన్ని మూసివేసి, వార్తా సేకరణ, ప్రసారాన్ని అడ్డుకోవడం మొత్తం జర్నలిస్టు లోకాన్ని భయపెట్టడమేనని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


# చికెన్ ధరలకు రెక్కలు!

- కిలో రూ.4 వందలు
- ఒక్క రోజులో రూ.100 పెరుగుదల
- బోన్ లెస్ చికెన్ రూ.600 పైమాటే
- ఘోల్లుమంటున్న వినియోగదారులు



**ముద్ర డెస్క్:**
నాన్‌వెజ్ ప్రియులకు భారీ షాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కిలో చికెన్ ధర ఏకంగా రూ.400 (స్కిన్‌లెస్)కు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో బోన్‌లెస్ రూ.400కి పైగా విక్రయిస్తున్నారు. విజయవాడలో ఈరోజు కేజీ రూ.400గా నమోదయింది. గత వారం కిలో చికెన్ రూ.300గా ఉండగా.. ఇప్పుడు 400కు చేరింది. ఒక్కసారిగా రూ.100 పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. చికెన్ ధర ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేజీ చికెన్ ధర సాధారణంగా రూ.170 నుంచి రూ.220 మధ్య ఉంటుంది. శ్రావణ మాసం, కార్తీక మాసంలో అయితే ఇంకా తక్కువగా ఉంటుంది. కానీ గత 2 నెలల నుంచి ధరల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా ఫిబ్రవరి మధ్య నుంచి భారీగా పెరుగుతోంది. ఎండల తీవ్రత కారణంగా కోళ్లు చనిపోవడం, రంజాన్ డిమాండ్ కారణంగా చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.400కు చేరడంతో కొనుగోలుదారులు వెనుదిరుగుతున్నారు.
'వామ్మో.. నాలుగొందలు పెట్టి చికెన్ కొనాలా?' అంటూ చాలామంది మార్కెట్ వద్దే వెనక్కి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగి సామాన్య ప్రజలపై పెను భారం పడింది. ఈ సమయంలో చికెన్ ధరలు కూడా పెరగడంతో పరిస్థితి మరింత కష్టంగా మారింది. రోజువారీ ఖర్చులు పెరుగుతుండటంతో.. మాంసాహారం కొనడం కూడా చాలా మందికి భారంగా మారుతోంది. ధరలు పెరగడంతో చికెన్ మార్కెట్‌లో కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. దాంతో వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కస్టమర్లు రాకపోవడంతో చికెన్ మార్కెట్ వెలవెలబోతోంది. విక్రయాలు తగ్గిపోవడంతో వ్యాపారులకు తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ధరల పెరుగుదలకు సరఫరా కొరత, డిమాండ్-సప్లై అసమతుల్యత అని వ్యాపారులు చెబుతున్నారు.

# రైలు కిందపడి వ్యక్తి మృతి



**ముద్ర, గద్వాల:**
గద్వాల రైల్వేస్టేషన్ పరిధిలో గల మేలచెర్వు వద్ద శనివారం రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. గద్వాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గద్వాల పట్టణం నదీ అగ్రహారానికి చెందిన మునిస్వామి (42) శనివారం సాయంత్రం మేలచెర్వు రైల్వే ట్రాక్ పక్కన మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా పొరపాటున పడ్డాడా అన్న అంశంపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### వెలుగుమట్ల బాధితుల కోసం..

# బీజేపీ యుద్ధం

- రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు

**ముద్ర, ఖమ్మం:**
వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన భూభాధితుల సమస్యపై బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు తీవ్రంగా స్పందించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తూ ఆదివారం తన నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో స్పష్టమైన హామీ ఇచ్చారు. సమావేశానికి హాజరైన బాధితులు తమ సమస్యలను నేరుగా వాసుదేవ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతను దేవకి వాసుదేవరావు ఘాటుగా ఖండించారు. కొద్దిమందికి మాత్రమే ఇళ్లు కేటాయించి మిగతా అర్హులను పక్కనపెట్టడం అన్యాయమని మండిపడ్డారు. ఎక్కడైతే ఇళ్లు కూల్చారో అక్కడే తిరిగి ఇళ్లు కట్టించే వరకు బిజెపి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సన్నే ఉదయ ప్రతాప్, న్యాయవాది నేరెళ్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు నకిరికంటి వీరభద్రం, సీనియర్ నాయకులు వక్కలంక సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 23.03.2026




నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## కవితంటే... ఎందుకు ఆరాటం!

### - ప్రపంచ కవితా దినోత్సవ శుభాకాంక్షలు




కవితంటే ఎందుకు
చెవికోసుకుంటావ్?
అక్షరాల ఆలాపనలో ఆత్మస్వరాలు
వినిపిస్తాయా,
నిశ్శబ్దంలో నిగూఢమైన నిజాలు
నవ్వుతూ నీ చెవిని తాకుతాయా.
కవితంటే ఎందుకు అంత కష్టపడతావ్?
పదాల పుట్టలో భావాల బంగారం
దొరుకుతుందా,
ఒక్క పంక్తి పుడితే
వేల హృదయాలు పులకరించుతాయా.
కవితంటే ఎందుకు వెంపర్లాడుతావ్?
మనసు మబ్బుల మధ్య మెరుపులా
మెరవాలా,
లోపలి తుఫాన్లను
లయగా మార్చాలని తపనా?
కవితంటే ఎందుకు ఖర్చులు పెడతావ్?
అది వ్యయం కాదు, యజ్ఞం అంటావా,
అక్షరాలకు అంకితమైతే
అమరత్వమే లభ్యమవుతుందా.
కవితంటే ఎందుకు గళమెత్తుతావ్? —
నిశ్శబ్దం చెప్పలేని బాధలు
నాదమై పలకాలా,
న్యాయం నడవాలని నినదిస్తావా.
కవితంటే ఎందుకు పరుగెత్తుతావ్?
కాలం కంటే ముందే
కలల్ని చేరుకోవాలా,
ప్రతి క్షణాన్ని పదాల్లో బంధించాలనే
ఆత్రుతా?
కవితంటే శ్వాసల మధ్య సాగే
సంగీతం,
హృదయానికి హృదయం కలిపే
సేతువు,
మనిషిని మనిషిగా నిలబెట్టే మహోన్నత
సాధన!



గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్,
భాగ్యనగరం

## బడ్జెట్లో విద్యకు కేటాయింపులు పెరిగాయి కానీ..?





ఒక సమాజం ప్రగతి, వ్యక్తిత్వ వికాసానికి విద్య పునాది. ఇది కేవలం అక్షరాస్యతకే కాకుండా విచక్షణా జ్ఞానాన్ని అందించి బాధ్యతగల పౌరులను తయారు చేస్తుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులను సృష్టించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. పేదరిక నిర్మూలన, మూఢనమ్మకాల నివారణ, లింగ సమానత్వం, శాస్త్రీయ అభివృద్ధి అన్నింట్లో విద్య కీలకం. క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

విద్యాభివృద్ధికి తగిన నిధులు అవసరమని కొఠారి కమిషన్ (GDPలో 6%), జాతీయ విద్యా విధానం (NEP 2020) స్పష్టం చేశాయి. తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర బడ్జెట్ లో 18% కేటాయింపును సూచించింది.

అయితే తెలంగాణలో 2014–15లో 10.89%గా ఉన్న విద్యా కేటాయింపులు 2023–24లో 6.5%కు తగ్గాయి. 2026–27 బడ్జెట్ లో ₹26,674 కోట్లు (8.22%) కేటాయించారు. బడ్జెట్ పరిమాణం 200% పెరిగినా, విద్యా కేటాయింపులు 126% మాత్రమే పెరిగాయి.

ప్రభుత్వం కేటాయింపులు పెంచినా, అవి అవసరాలకు సరిపోవడం లేదు. యూనివర్సిటీలకు నిధులు పెరగడం మంచిదే కానీ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఖాళీ టీచర్ పోస్టులు, నియామకాలకు సరైన ప్రాధాన్యత కనిపించడం లేదు. కమిషన్ సూచించిన 18%తో పోలిస్తే 8.22% చాలా తక్కువ.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ వెనుకబడి ఉంది. ఢిల్లీ 22–25%, బీహార్ 18–19%, ఛత్తీస్‌గఢ్ 18%, అస్సాం 15–16%, ఆంధ్రప్రదేశ్ 12–13% కేటాయిస్తున్నాయి. జాతీయ సగటు 14–15% కాగా, తెలంగాణ తక్కువగా ఉంది. ప్రభుత్వం మేనిఫెస్టోలో 15% హామీ ఇచ్చినా, ప్రస్తుతం సగం మాత్రమే అమలు చేసింది.

విద్యపై ఖర్చు కాదు.. భవిష్యత్తుపై పెట్టుబడి. ఇది నైపుణ్యం కలిగిన పౌరులను తయారు చేసి ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. కాబట్టి విద్యా కేటాయింపులను అంకెలుగా కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తుగా చూడాలి.



-జుర్రు నారాయణ యాదవ్
తెలంగాణ టీచర్స్ యూనియన్
9494019270.

## ఊపిరాడనితనం

రక్షణకు ఉండాల్సినవారే రక్కసులై
మనసు ముక్కలు చేస్తున్నారు.
"మంది" అనే భయంతో బిడ్డను
వెనక్కి లాగే సంకుచితులు.
సొంత రక్తాన్ని పాతిపెడతాం అని
ఫర్మానాలు జారీ చేస్తారు.

మగవారితో మాట్లాడితే తప్పే అనే
అమ్మ —
ఆమె మాటలే నా ఊపిరిని
కాల్చేస్తున్నాయి.
బయట స్వేచ్ఛగా జీవించే సోదరుడు
నాపై పోలీసులా ఆదేశాలిస్తాడు
తనకు ఫ్రీడమ్, నాకు ఫెన్సింగ్!
అమ్మ మాటలకు తలూపుతూ
మూగగా నాన్న
నా కళ్లలో నీళ్లు చూసినా మాట్లాడడు
ఆ మౌనం కూడా ఒక హింసే!
కాకుల్లా కులపోళ్లు —
పొరుగింట్లో, బంధువుల్లో, తోటి
ఉద్యోగుల్లో
నా పేరును వ్యాప్తి చేస్తారు.
ఇంటి గోడల మధ్యే శత్రువులు,
రక్త సంబంధాలే కత్తులు.
ప్రేమ పేరుతో ఊపిరి బిగబట్టడం
—
ఇదే నిజమైన ఊపిరాడనితనం!

ఇప్పుడు
సమయం
వచ్చింది



- సాధన
తేరాల,ఖమ్మం

## ఇన్విజిలేటర్లకు ఇంకెన్నాళ్లు పాత రేట్లు?!



ఈ నెల 14వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ సంవత్సరం ఏప్రిల్ 13 వరకు అనగా నెల రోజులపాటు జరగనున్నాయి.

ఉపాధ్యాయులు చీఫ్ సూపరిడెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో విధులకు కేటాయించిన ఉద్యోగులకు అందించే రేమ్యునరేషన్ పై సర్వత్రా ఉపాధ్యాయుల్లో చర్చ కొన సాగుతోంది. గత ఎనిమిది సంవత్సరాల క్రితం విడుదలైన జీవో.11 రేట్ల ప్రకారమే చెల్లిస్తుండడం గమ నార్హం. దూర ప్రాంతాల నుండి పరీక్షా కేంద్రానికి హాజరవుతున్న ఉపాధ్యాయులకు అప్పటిరేట్లు ఏ మాత్రం సరిపోవడం లేదన్నది వాస్తవం. చీఫ్ సూపరిడెంట్లు, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లకు రూ.66 అలాగే ఇన్విజిలేటర్లకు రూ.33 చెల్లించడంతో ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించడానికి విముఖత చూపుతున్నారు. అలాగే పరీక్షల సమయంలో సెంటర్ లో విద్యార్థులకు అందించాల్సిన సౌకర్యాలకు చెల్లిస్తున్న కంటింజెంట్ రూ.5 చెల్లిస్తుండటంతో అవి ఏమాత్రం సరిపోవడం లేదు.

ఇక పరీక్షలు పూర్తయిన అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనం క్రతువు ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియకు కూడా ప్రభుత్వం అదే జీవోలోని రేట్లను చెల్లించడం శోచనీయం.ప్రతి జవాబు పత్రానికి రూ.10 చెల్లించడం, టిఏ,డిఏలు కూడా పాత రేట్లనే చెల్లించడంతో ఉపాధ్యాయులు ముల్యాంకన హాజరకు ఉత్సాహం చూపడం లేదు. ఇక స్పెషల్ అసిస్టెంట్ల విషయానికి వేస్తే వీరికి టిఏ,డిఏ లు చెల్లించకుండా కేవలం రూ.250 మాత్రమే చెల్లించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వమే ఆలోచించాలి. ఉపాధ్యాయ సంఘాలు ప్రతి ఏటా మూల్యాంకనా కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. 80 మార్కుల జవాబు పత్రానికి, 40 మార్కుల జవాబు పత్రానికి రూ.10 ఇవ్వడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంటర్ మీడియట్ పరీక్షలకు చెల్లిస్తున్న రేట్లకి, పది పరీక్షలకు చెల్లిస్తున్న రెట్లకీ భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇంటర్ మీడియట్ పరీక్షల రెమ్యునరేషన్ మరోసారి 25 శాతం పెంచింది. చీఫ్ సూపరింటెండెంట్ లకు, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ కు సెషన్ కు రూ.440,ఇన్విజిలేటర్ లకు రూ.235 అలాగే ఒక్కో జవాబు పత్రం మూల్యాంకనం చేయడానికి రూ.29.57 చెల్లిస్తున్నది. టిఏ, డిఏ రేట్లలో ఇంతటి వ్యత్యాసం ఏమిటో అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు.5 లక్షలకు పైగా హాజరవుతున్న ఇట్టి పరీక్షలకు గౌరవప్రదమైన భత్యం చెల్లించాలి.పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా రేట్లను పెంచాల్సిన అవశ్యకత ఉంది. ఇంటర్ పరీక్షలకు చెల్లిస్తున్న రేట్లను పది పరీక్షలకు కూడా చెల్లించే విధంగా ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీచేయాలి.

- సుధాకర్.ఏ.వి

– రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
– స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
– 9000674747



## మంచినీళ్లు కొంటమా? ఆశ్చర్యపడ్డారొకనాడు!

**- అదే నీళ్లను నిర్లక్ష్యం చేస్తే బంగారంలా భారం కాదా మరి**

**- నీళ్లను పొదుపు చేస్తే మనుగడ లేదంటే అంపశయ్య**



ఈ భూగ్రహం మీద నాగరికతలు నదీ ఒడ్డుననే వెలసిల్లాయి. నైలు నది ఆధారంగా ఈజిప్టు నాగరికత, టైగ్రిస్ –యూప్రటిస్ నదుల ఆధారంగా మెసపటోమియా నాగరికత, పసుపు నది ఆధారంగా చైనా నాగరికతలు వర్ధిల్లాయి. గంగా సింధు నదులను ఆధారం చేసుకుని హరప్పా, మొహంజ దార లాంటి ప్రాచిన భారతదేశ నాగరికతలు, దక్షిణాన పాలార్ నదిని ఆనుకొని ఉత్తర, దక్షిణ ఆర్కాట్ నాగరికతలు వెలసిల్లినాయి. మరో మాటలో చెప్పాలంటే ఈ నాగరికతలన్నీ నీటి సామ్రాజ్యాలు. ప్రస్తుతము ప్రపంచవ్యాప్తంగా 280 కోట్ల మంది ప్రజలు నీటి కొరతతో బాధపడు తున్నారు. జనాభా విపరీతంగా పెరిగిపోవడం, పట్టణీకరణ, పరిశ్రమల కారణంగా నదులు కలుషితమైపోయి మానవ మనుగడను ప్రశ్నిస్తున్నాయి. వాతావరణ మార్పులు, కాలుష్యం, నీటి అధిక వినియోగం మంచినీటి కొరతను సృష్టిస్తున్నాయి. మరో విధంగా ప్రభుత్వాలు అందుబాటులో ఉన్న నీటి వనరులను సరిగ్గా నిర్వహించకపోవడం నీటి కొరతను సృష్టిస్తున్నాయి. నీటి సంరక్షణ పద్ధతులను పాటించకపోతే రాబోయే కొన్నేళ్లలో బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ సహా మరో 20 నగరాలలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయని నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. బెంగళూరులో వృషభవతి నది, ఢిల్లీలో యమునా నది, హైదరాబాదులో మూసీ నదులు పూర్తిగా కలుషితమై మురుగు నీటిని తలపిస్తాయి. ఇప్పుడే మేల్కొన్న తెలంగాణ ప్రభుత్వాలు యమునా ఇటు మూసి ప్రక్షాళనను చేపట్టాయి. ఈ వ్యవహారం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టినట్లుగా ఉంది. ఎంత కాలానికి ఈ ప్రక్షాళనలు సత్ఫలితాలను ఇస్తుందనేది ప్రశ్నార్థకమే. నీటి కథలోనికి మనం తొంగి చూస్తే ప్రపంచ భూభాగంలో మూడు వంతులు సముద్రాలతో నిండి ఉంది. 1400 మిలియన్ కిలోమీటర్ల నీరు భూమిపై ఉన్నప్పటికీ మొత్తం నీటిలో 2.7% మీరు మాత్రమే మంచి నీరు ఉందనేది తెలుసుకోవాలి. ఉన్న మంచినీరులో 75.2% ధృవపాంత్రములో మంచుగా ఘనీభవించి ఉంది. 22.6% భూగర్భజలంగా ఉంది. కేవలం 0.02% మాత్రమే ప్రపంచంలోని జరాశయాలు, నదులు వాతావరణంలో తేమగా, మట్టిలో చెట్లలో ఉంది. నిజానికి మంచినీరు పూర్తిగా కొరతతో ఉన్న గొప్ప వనరు. బ్రహ్మంగారి కాలజ్ఞానంలో మంచినీరు ప్రజలు కొంటారు అని చెప్పినప్పుడు అప్పటి ప్రజలు నవ్వుకున్నారు. నేడు అది నిజముగా నిలిచింది. ప్రభుత్వాలు, మానవులు జల సంరక్షణ పద్ధతులు పాటించకపోతే బంగారం కంటే మంచినీరు పిరమయ్యే రోజులు ఎంతో దూరంలో లేవు. సామాజిక అభివృద్ధి కేవలం మంచినీటి పైనే ఆధారపడి ఉంది. రాబోయే ప్రమాదాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి 1992లో బ్రెజిల్ లోని రియోడిజనీరో లో పర్యావరణం అభివృద్ధి పై 21వ ఏజెండాలో మార్చ్ 22ను జల దినోత్సవంగా ప్రతిపాదించింది. 1993లో ప్రపంచం తొలి జల దినోత్సవం నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా 3.6 బిలియన్ల మందికి సురక్షిత పారిశుద్ధ్య సేవలు లేవు. 2.3 విలియంల మందికి ఇంట్లో సబ్బు నీటితో చేతులు కడుక్కునే సదుపాయం లేదు. ప్రతి ఏటా 2, 57,400 మంది కలుషిత నీరు సేవించి టైఫాయిడ్, కలరా డయేరియా, అతిసారా వ్యాధుల వల్ల మరణిస్తున్నారు. మంచి నీటిని సమస్యను సమర్థ వంతంగా అధిగమించిన దేశం ఇజ్రాయిల్. నేడు ప్రపంచమంతా ఇజ్రాయిల్ ను అనుసరించాల్సిన అవసరం ఉంది. 70 ఏళ్ల క్రితం పుట్టిన ఇజ్రాయిల్ 60 శాతం ఎడారి ప్రాంతం. తీవ్ర నీటి వనరుల కొరత చుట్టుముట్టిన దేశం. ఇజ్రాయేలులో దాదాపు 80% మురుగునీటిని రీసైక్లింగ్ చేసి పునర్వినియోగం చేస్తున్నారు. మంచినీటి సాగునీటి సమస్యలను అధిగ మించి నేడు కూరగాయలను, పండ్లను ఇతర దేశాల కు ఎగుమతి చేస్తున్న దేశం ఇజ్రాయిల్. 150 పైగా దేశాలు నీటి నిర్వహణ రంగంలో ఇజ్రాయేలును నమూనాగా తీసుకొని శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రచిస్తున్నాయి. మంచినీటి సంరక్షణ కోసం 1983లో ప్రధానమంత్రి ఆధ్వర్యంలో నేషనల్ వాటర్ రిసోర్స్ కౌన్సిల్ ఏర్పడింది. 1990లో అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులతో నేషనల్ వాటర్ బోర్డును ఏర్పరిచారు. 1987లో జాతీయ జలవిధానాన్ని ప్రతిపాదించారు. దీనినే 2002 సంవత్సరంలో రివైజ్ చేశారు. 2012లో నీటి సంబంధిత అంశాలన్నిటిని నిర్వచించేందుకు స్థానిక, ప్రాంతీయ, రాష్ట్ర, జాతీయ దృష్టి కోణంతో సమగ్ర నీటివిధానాన్ని రూపొందించారు. దీనితో అంతరాష్ట్ర జల వనరుల పంపిణీ, నదులు, నదీ లోయల ఏర్పాటు, బేసిన్ అథారిటీని ఏర్పరిచారు. భారతదేశంలో 2019లో జనశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జల శక్తి అభియాన్ ను 2019 జూలై 1 నుండి 2019 సెప్టెంబర్ వరకు, 2019 అక్టోబర్ నుండి 2019 నవంబర్ 30 వరకు రెండు దశల్లో ప్రాజెక్టును ప్రారంభించింది. అభియాన్ లో భాగంగా నీటి సంరక్షణ కోసం వర్షపు నీటిని ఒడిసి పట్టుకునే నిర్మాణాలను చేపట్టడం, సాంప్రదాయ జనవరుల పునరుద్ధరణ, బోరు బావుల పునర్వినియోగం, రీఛార్జి, వాటర్ షెడ్ తో పాటు ముమ్మర అడవుల పెంపకాన్ని చేపట్టింది. పంటలకు పెద్ద ఎత్తున నీటిని దుర్వినియోగం చేయకపోవటం, మంచినీటిని వృథా చేయకపోవడం, నీటి పొదుపు పాటించడం జల సంరక్షణ పై అవగాహన కలిగి ఉండడం, చెట్లను పెంచడం ప్రతి మానవుని జీవన విధానంలో భాగము అయినప్పుడు మాత్రమే మానవ మనుగడ కొనసాగుతుందని లేదంటే రాజైనా పేదైనా అంపశయ్య మీద అల్లాడవలసిందేననేది సత్యం.

-కేదారి ప్రవీణ్ కుమార్
సీనియర్ జర్నలిస్ట్
9490299526.



## సమగ్రాభివృద్ధి దిశగా దృఢ సంకల్పం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసిన ప్రణాళికగా నిలిచింది. వ్యవసాయం నుంచి పరిశ్రమలు, విద్య నుంచి ఆరోగ్యం, క్రీడలు–యువజన సంక్షేమం వరకు అన్ని రంగాలను సమానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూపొందించబడింది.వ్యవసాయ రంగానికి కీలక ప్రాధాన్యత లభించింది. సాగునీటి ప్రాజెక్టుల విస్తరణ, రైతు బంధు, రైతు బీమా బలోపేతం ద్వారా రైతుల ఆర్థిక భద్రత పెంపుపై దృష్టి పెట్టింది. సాంకేతికత వినియోగం, మార్కెటింగ్ సదుపాయాల మెరుగుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చనున్నాయి.సామాజిక సంక్షేమంలో వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు, గృహనిర్మాణం, మహిళా సాధికారత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చింది. విద్యలో పాఠశాలల ఆధునీకరణ, డిజిటల్ లెర్నింగ్, ఉన్నత విద్యా అవకాశాల విస్తరణపై దృష్టి పెట్టగా, ఆరోగ్య రంగంలో ఆసుపత్రుల సామర్థ్య పెంపు, గ్రామీణ వైద్య సేవల విస్తరణకు చర్యలు తీసుకుంటోంది.పరిశ్రమల రంగంలో పెట్టుబడులు, స్టార్టప్ ప్రోత్సాహం, ఐటీ–ఫార్మా అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా పెట్టుకుంది.

### క్రీడలు, యువజన సంక్షేమం

ఈ బడ్జెట్‌లో క్రీడలు, యువతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్టేడియాలు, శిక్షణ కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను ప్రోత్సహించనుంది. అంతర్జాతీయ స్థాయి కోచింగ్ సదుపాయాల ద్వారా రాష్ట్రాన్ని క్రీడల్లో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో 360 కోట్లు, తరువాత 426 కోట్లు, ప్రస్తుతం 646 కోట్లు కేటాయించడం ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై ఉన్న దృష్టిని చూపిస్తోంది.

యువజన సంక్షేమంలో నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ ప్రోత్సాహం, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చింది. ఉద్యోగాలు, కెరీర్ గైడెన్స్, డిజిటల్ స్కిల్స్ ట్రైనింగ్ ద్వారా యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తోంది. రాజీవ్ యువ వికాసం కోసం ₹6000 కోట్లు కేటాయించడం విశేషం.

### మౌలిక సదుపాయాలు

రోడ్లు, రవాణా, పట్టణ–గ్రామీణ కనెక్టివిటీ అభివృద్ధికి పెట్టుబడులు పెంచింది. మెట్రో విస్తరణ, స్మార్ట్ సిటీలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయి.తెలంగాణ బడ్జెట్ 2026–27 అభివృద్ధి, సంక్షేమం, యువశక్తిపై ఆధారపడిన సమగ్ర ప్రణాళిక. క్రీడలు, యువజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది.



- సురేష్ కాలేరు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

కారుకు ఇంజిన్ ఆయిల్ సమయానికి మార్చండి



ఇది ఇంజిన్ లైఫ్ పెంచి, స్మూత్ డ్రైవింగ్‌కు సహాయపడుతుంది.


# కూలీ నుంచి డాక్టరేట్ వరకు..

నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని వైద్య కళాశాలలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసిన ఆ కుర్రాడు.. పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదిగాడు. పదో తరగతిలో తప్పినా, ఏడాది పాటు కార్మికుడిగా పనిచేస్తున్న ఆయన మనసు మాత్రం చదువుపై వీడలేదు. చదువుకోవాలనే ఆయనకున్న తపన ఆయనను ఆ తీరంవైపు నడిపించింది. ఒక్కో అడుగు బలంగా వేస్తూ తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. కష్టపడి చదివి ఉన్నతస్థాయిలో ఎదగాలని కలలు కంటూ.. ఆ కలలను సాకారం చేసుకుని డాక్టరేట్ సాధించి ఆదర్శంగా నిలిచారు. ఇది నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం అనంతవరం గ్రామానికి చెందిన డాక్టర్ ఆవుల సైదులు విజయగాథ..





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ఒక సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన కీ.శే. రాములమ్మ, రంగయ్య దంపతులకు ఎనిమిదవ సంతానంగా జన్మించిన ఆవుల సైదులు, తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగులో పీహెచ్ డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఓరియంటల్ కళాశాలలో చేరి పీడీసీ, బీఏ (ఎల్), ఎం.ఎ (తెలుగు) పూర్తి చేశారు. అదనంగా దూరవిద్య ద్వారా ఎంఏ సంస్కృతం కూడా పూర్తి చేశారు.

హైదరాబాద్‌లో తెలుగు పండిత శిక్షణ పూర్తి చేసిన ఆయన 2012లో ఏపీ సెట్, 2017లో యూజీసీ నెట్ పరీక్షలను ఉత్తీర్ణులయ్యారు. దాదాపు 12 ఏళ్ల పాటు వనపర్తి పట్టణంలోని వివిధ జూనియర్ కళాశాలల్లో సంస్కృత అధ్యాపకులుగా సేవలందించారు. 2018లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో నాలుగో ర్యాంకు సాధించి, వనపర్తి జిల్లా, మదనాపురం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో టీజీటీ తెలుగు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కందుకూరులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో పీజీటీగా విధులు నిర్వహిస్తున్నారు.

2018 సెప్టెంబర్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పీహెచ్ డీలో ప్రవేశం పొంది "నాగర్ కర్నూల్ జిల్లా శతక సాహిత్యం – ఒక పరిశీలన" అనే అంశంపై ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టా సాధించారు.

ఈ సందర్భంగా సైదులు తన తల్లిదండ్రులకు, చిన్నప్పటి నుంచి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు సాగి కమలాకర శర్మ, రఘు విజయలక్ష్మి, పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తి అభినందించారు. అలాగే ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ప్రసాద్ సన్మానించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉన్నతాధికారులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు, మిత్రులు, కుటుంబ సభ్యులు ఈ విజయాన్ని స్వాగతిస్తూ, గ్రామానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చినందుకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ ఆవుల సైదులు మాట్లాడుతూ తన ఈ జ్ఞానాన్ని బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులను సమాజంలో అత్యున్నత స్థానంలో ఉంచడానికి అందిస్తానని తెలిపారు.


## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**ముద్ర, గద్వాల:**

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆదివారం గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి నర్సింహులు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ.. తన కుమారుడు సాయి సాకేత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి ఎలాంటి వృధా ఖర్చులు పెట్టకుండా ప్రస్తుతం వేసవికాలం సందర్భంగా ప్రజలకు ఉపయోగకరమైన చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ప్రజల దహార్తిని తీర్చేలా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అదే విధంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు సైతం చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు .

## పేద వైద్య విద్యార్థికి ఆర్థికసాయం



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

మారేపల్లి సురేందర్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా పేద వైద్య విద్యార్థి కి రూ. 2.10 లక్షల ఆర్థికసాయం ఆదివారం అందించారు. మహబూబ్ నగర్ 38వ డివిజన్ కు చెందిన బి.వెంకటేశ్వర్లు, లావణ్య దంపతుల కుమార్తె భాగ్య లక్ష్మి వైద్య విద్య 2వ సంవత్సరం చదువుతోంది. కళాశాల, హాస్టల్ వసతి నిమిత్తం నగదును మహబూబ్ నగర్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కూతురు, ఎం ఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మారేపల్లి మహతి రెడ్డి కుటుంబం సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థినికి అందించారు. ఈ సందర్భంగా మహతి రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యానిధి కార్యక్ర మాన్ని స్ఫూర్తిగా తీసుకుని పేద విద్యార్థులను ఈ ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామనని తెలిపారు. తన తండ్రి సురేందర్ రెడ్డి సహకారం తో జిల్లా లోని పేద విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు.

## 23న యథావిధిగా ప్రజావాణి

**ముద్ర, గద్వాల:**

23 నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని గత సోమవారం అధికారులకు జనాభా గణన శిక్షణ కార్యక్రమాలు ఉన్నందున తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు.

## 49వ ఆరాధన మహోత్సవాలు ఏర్పాట్లు పూర్తి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

తూడుకుర్తి గ్రామం నందు సద్గురు పరబ్రహ్మ శ్రీ శ్రీ శ్రీ పల్లంకొండ మల్లయ్య గురుస్వాముల వారి 49వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక శాంతి, పరమానందం కలగాలని ఆశిస్తూ ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న సాయంత్రం 5 గంటలకు గంధోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని నిర్వహకులు తెలిపారు. 22న ప్రదానోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు లక్షపుష్పార్చన, 11 గంటలకు ప్రదక్షిణలు, రాత్రి 7 గంటలకు లక్షదీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు, సమాప్తి కార్యక్రమాలు నిర్వహించి మహోత్సవాలను ముగిస్తారు. ఈ మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



## తెలంగాణలో అధికారమే బీజేపీ లక్ష్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు



**ముద్ర, కూకట్‌పల్లి:**

తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 'పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్–2026 రెండు రోజుల శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కూకట్ పల్లి నియోజకవర్గ స్థాయి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా బీజేపీ మేనిఫెస్టోలో ఉన్న ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్, జమ్మూ కాశ్మీర్ విలీనం వంటి కీలక వాగ్దానాలను ప్రధాని మోదీ నెరవేర్చారని కొనియాడారు. రాబోయే జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి అధ్యక్షులు కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. నిబద్ధతతో పనిచేసే వారికే కార్పొరేషన్ టికెట్లు దక్కుతాయని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా మరియు కూకట్ పల్లి ఇంచార్జ్ మాధవరం కాంతారావు, ఓ.ఎస్. రెడ్డి, పద్మయ్య, శ్రీకర్ రావు, మహేందర్, వినోద్ తదితరులు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## రజకులకు ఆర్థికంగా చేయూతనందిస్తా



**ముద్ర, తాండూర్:**

అభివృద్ధిలో ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్న రజక కులస్తులకు చేయూతనందిస్తానని ఆర్ బి ఎల్ అధినేత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాండూర్ పట్టణంలో రజక సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రజక సంఘ భవనానికి తన సొంత స్థలంలో రెండు గుంటల భూమిని కేటాయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో సంఘ అభివృద్ధి కోసం తప్పకుండా తన వంతుగా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. రజక సంఘానికి చేయూతనందించిన శ్రీనివాస్ రెడ్డి కి సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు, మున్సిపల్ కౌన్సిలర్లు, తాండూర్ పట్టణ రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు.. రైతులకు తోడ్పాటు

గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు

**ముద్ర, గద్వాల:**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించడం రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులకు మరింత తోడ్పాటు లభిస్తుందని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు అన్నారు. 'ప్రజాపాలన రైతు ఉత్సవాల' కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు జిల్లా పరిధిలోని అన్ని మండలాలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేటిదొడ్డి రైతువేదికలో ఆయన మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా సహాయం ఒక ఎకరం వరకు భూమి ఉన్న 70 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సీఎం రేవంత్ రెడ్డి తొలి విడతగా రూ. 3,590 కోట్లను నేరుగా విడుదల చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి, మైలగడ్డ రైతు వేదికలో తహసీల్దార్ కరుణాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, కేటిదొడ్డి, కొండాపురం గ్రామాల సర్పంచ్ లు, ఏఈఓలు, మండల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రెండు జిల్లాల చరిత్ర మహోన్నతం

స్పీకర్ గడ్డం ప్రసాద్



**ముద్ర, కూకట్‌పల్లి :**

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కొనియాడారు. వివేకానందనగర్ లో ప్రేకాస మినీ హాల్‌లో 'మేము సైతం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక కరపత్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. కాకతీయుల కాలంలో 'గొల్లకొండ'గా పిలవబడిన నేటి గోల్కొండ, కుతుబ్ షాహీలు, నిజాంల పాలనలో అంతర్జాతీయ గుర్తింపు పొందిందని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల చారిత్రక కట్టడాలు, రాజకీయ, సాంస్కృతిక విశేషాలను భావితరాలకు అందించేందుకు 'మేము సైతం' సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తూ మాతృభూమి రుణం తీర్చుకుంటున్న ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధుల జీవిత విశేషాలను ఈ పుస్తకంలో పొందుపరచడం ద్వారా నేటి తరానికి స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బి.వెంకటేశ్వర్లు, ప్రతాప్, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఉప్పు సత్యనారాయణ, ఎర్ర యాకన్న, పిసాటి జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ పవర్ లిఫ్టింగ్ లో ప్రతిభ

**ముద్ర, మల్కాజ్ గిరి:**



తెలంగాణ రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్ డా. పెరుమాళ్ల ప్రదీప్ కుమార్ అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచారు. వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో వెండి పతకాన్ని సాధించి, వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ గా గుర్తింపు పొందారు.డా. సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో విశాఖపట్నం నగరంలో నిర్వహించిన "విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఉగాది పురస్కారాలు 2026" కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బగ్చి, తుమ్మిడి రామ్ కుమార్, రవి శంకర్ మాలిసెట్టి డిప్యూటీ కమిషనర్, కస్టమ్స్, సినీ నటుడు శ్రీ రాజీవ్ కనకాల ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

## బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి బాసు హన్మంతు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 3,24,234 కోట్ల బడ్జెట్లో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం రూ. 12,511 కోట్లు, అంటే సుమారు 3.8 శాతం మాత్రమే కేటాయించడం బీసీల గొంతుకోసినట్లేనని విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాకు ఉపయోగపడే నెట్టెంపాడు, బీమా, జూరాల ప్రాజెక్టు పెండింగ్ పనులకు, కాల్వల ఆధునీకరణకు బడ్జెట్లో పైసా కేటాయించలేదన్నారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నా జిల్లా ప్రాజెక్టులపై వివక్ష చూపించారని ఆరోపించారు. సాగునీటి రంగానికి ఇచ్చిన రూ.22,615 కోట్లు కేవలం పాత బకాయిలకే సరిపోతాయన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, సూర్య గౌడ్, పటేల్ జనార్దన్ రెడ్డి, కౌన్సిలర్లు చంటన్న, గువ్వల గోపాల్, జగదీష్, చిత్తారి కిరణ్, భాస్కర్, రాము, నరసింహులు, అప్సర్, రాజు, రఘు పాల్గొన్నారు.

కారుకు బ్రేకులు సరిచూడండి

బ్రేక్ ప్యాడ్లు, బ్రేక్ ఆయి ల్ చెక్ చేస్తే సేఫ్టీ పెరుగుతుంది.




# గడువులోపు పనులు పూర్తి చేయాలి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, పెగడపల్లి:** ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గడువులో పూర్తి చేయాలని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో ఆదివారం మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పెగడపల్లి మండల కేంద్రంలో రూ. 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పెగడపల్లి మోడల్ స్కూల్ లో రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మించిన వంటశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2026 – 27 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక కిచెన్ షెడ్ ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులు తీసుకువచ్చి సామాన్యులకు ఉన్నత విద్యను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు.

**సమస్యలు తెలుసుకున్న మంత్రి..**

**ముద్ర, గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఎనుగుమట్ల లో ఎండా కాలంలో సూర్య తాపానికి చెట్ల నీడన కూర్చొని గ్రామస్థులు సేద తీరుతున్నారు. చెట్ల కింద సేద తీరుతున్న వారిని చూసి అటుగా వెళ్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వాహన శ్రేణి ఒక్కసారిగా నిలిచిపోయింది. వాహనంలో నుంచి దిగిన మంత్రి అడ్లూరి అక్క ఎట్లున్నావ్.. అన్న ఎట్లున్నావ్.. అని ఆపాయ్యంగా పలకరించారు. మంత్రిని చూసిన గ్రామస్థులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. మంత్రి సామాన్యులను చూసి వాహనం నిలిపి మందలించడంతో సంతోషం వ్యక్తం చేశారు. అయితే సాక్షాత్తు మంత్రి తమ కళ్ల ముందు కనిపించడంతో వారు సమస్యలను వివరించారు. వార్డులో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు కరెంటు పోల్స్ కావాలని విన్నవించారు. మంత్రి వెంటనే స్పందించి వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## శృంగేరి శారదా పీఠాధిపతి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి



**ముద్ర, కరీంనగర్:** కర్ణాటక లోని శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధిపతి అనంత భారతీ తీర్థ మహాస్వామి 76వ జయంతి ఉత్సవాల్లో కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి ఆదివారం

నిర్వహించిన పలు ప్రత్యేక పూజల్లో సంజయ్ కుమార్ పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం లో విధు శేఖర భారతి స్వామి నిర్వహించిన సహస్ర నారికేళ హవనం, మహా యజ్ఞం, పూర్ణా హుతి కార్యక్రమంలో కూడా కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సహస్ర నారికేళ హవనం యజ్ఞం ప్రాసస్త్యం గురించి శృంగేరి పీఠం పూజారులు మంత్రికి వివరించారు. విధుశేఖర భారతి స్వామీ కేంద్ర మంత్రికి సహస్ర నారికేళ హవనం మహాయజ్ఞం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బండి సంజయ్ శృంగేరి శారదాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి పీఠ తెలంగాణ బాధ్యులు వ్యాసోజల రాధా కృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి



**ముద్ర, గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్ల – బొంకూర్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. పూజారులు పూర్ణ కుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 23 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషిచేస్తా

**- ఎమ్మెల్యే రామారావు పటేల్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు విడుదల అయ్యేలా చూస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు మంజూరైన నిధుల ఉత్తర్వులను సంబంధిత గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేశారు. భైంసా మండలం వాలేగాం గ్రామానికి రూ.15 లక్షలు, ముథోల్ మండలం మచ్కల్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షల నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రకారం తాను ముందుకెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# జీసీసీ విధానం రద్దు చేయాలి

**- సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:** విద్యుత్ బస్సుల పథకాల్లో కొనసాగుతున్న గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్ లో ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన విద్యుత్ బస్ ల విధానంతో ప్రజలు, కార్మికుల పై పడే భారం పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ ఎం. వి. యాక్ట్ సవరణ 2019 విద్యుత్ బస్సుల విధానంతో రాష్ట్రాల హక్కులను కేంద్రం గుంజుకుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ బస్సుల పథకాలన్నీ కూడా గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో ఉన్నాయని చెప్పారు. బస్సుల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్ అన్ని ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలే చూస్తాయన్నారు. ఇందులో ఆర్టీసీలకు ఎటువంటి పాత్ర ఉండదన్నారు. కేవలం బస్సులు నడిచే రూట్ నిర్ణయిస్తుందన్నారు. చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఆ బస్సు తిప్పినా, తిప్పకపోయినా, ప్రతి నెలా ఆ విద్యుత్ బస్సుల కంపెనీకి డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు విద్యుత్ బస్సుల పథకాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1,11,651 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఒక్క రూపాయి కూడా ఆర్టీసీలకు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రైవేట్ ఆపరేటర్స్ కు రెవెన్యూ రిస్క్ లేకుండా చేయడానికే జీసీసీ పద్ధతిలో తెచ్చారన్నారు. విద్యుత్ బస్ స్కీం అమలులో ఆర్టీసీలకు ప్రాధాన్యత లేకుండా చేసి కేవ లం దేశీయ, అంతర్జాతీయంగా ప్రైవేటు పె ట్టుబడిదారులకు ప్రజా రవాణా సం స్థలను అప్పజెప్పడాన్ని తాము వ్యతిరేకస్తామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, సహాయ కార్యదర్శి పున్నం రవి, కోశాధికారి జి రాజే శం, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు జి. శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఏ. రామ్మోహన్, స్టాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మల్లయ్య, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ నాయకులు భద్రయ్య మాట్లాడారు.

## వాహనాల తనిఖీ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆదివారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రధానంగా డ్రంకెన్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరం మాత్రమే కాకుండా చట్టపరంగా కూడా శిక్షార్హమని పోలీసులు వాహన చోదకులకు వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటి చర్యలుంటాయని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సీట్ బెల్ట్ ధరించకుండా కార్ డ్రైవ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలపై చట్ట పరమైన కేసులు నమోదు చేయబడతాయని చెప్పారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని, తమ కుటుంబాల భద్రత కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ జానకి షర్మిల కోరారు.

# ‘జవహర్’ ఏర్పాటు అయ్యేదెప్పుడో!

**- నవోదయ విద్యాలయం కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లా ప్రజలు**

**బోథ్, ముద్ర:** ప్రతిభ ఉండి కుటుంబ ఆర్థిక స్థితి సరిగ్గా లేని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయాలు ఓ వరం. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్ర లేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ఈ విద్యా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవాటు పడేలా స్కౌట్స్, ఎన్‌సీసీలను నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వయించే జేఈఈ, నీట్ పరీక్షలకు సైతం ఇక్కడ అత్యుత్తమ శిక్షణను అందిస్తారు.




**జిల్లాకు మొండిచేయి..**

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యా కేంద్రాల ఏర్పాటును కేంద్రం విస్మరించింది. 2025 – 26 లలో కొత్తగా ప్రకటించిన 7 ఏడు నవోదయ విద్యా కేంద్రాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లేకపోవడం పట్ల ఈ ప్రాంత విద్యావంతుల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది. దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కల్గిన చదువుల తల్లి సరస్వతి దేవి ఈ ప్రాంతంలోనే కొలువై ఉన్నప్పటికీ సరైన విద్యా వనరులు లేక జిల్లా వాసులు నాణ్యమైన చదువుల కోసం అష్టకష్టాల మధ్య జిల్లాను దాటి వెళ్తున్నారు. మరికొంతమంది ఆర్థిక భారం, దూరభారం వల్ల మధ్యలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. తెలంగాణలో పాత పది జిల్లాల్లో యూనివర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ నిలిచింది. గిరిజన యూనివర్సిటీ, మైనింగ్ యూనివర్సిటీ లలో ఏదో ఒకటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఓ సభలో త్వరలోనే ఆదిలాబాద్ జిల్లా లో యూనివర్సిటీనీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ నేటికి జిల్లాలో యూని వర్సిటీ ఏర్పాటుపై స్పష్టత లేదు. ఇక్కడ ఏర్పాటు చేస్తారనుకున్న గిరిజన యూనివర్సిటీనీ ఉమ్మడి వరంగల్ లో, మైనింగ్ యూనివర్సిటీ నీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా బీజేపీ అభ్యర్థులు గెలిచినప్పటికీ కేంద్ర ప్రభుత్వం విద్యాలయాల ఏర్పాటులో జిల్లాను విస్మరించడంపై అన్ని వర్గాల నుంచి సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కల సాకరమయ్యేనా?**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం కాగజ్ నగర్ లో ఏకైక నవోదయ విద్యాలయం కొనసాగుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో మరో నవోదయ విద్యాలయ ఏర్పాటు కోసం ఆదిలాబాద్ జిల్లాలో మొదటగా భీంపూర్ మండలంలో స్థల పరిశీలన జరుపగా అనంతరం గుడిహత్నూర్ మండలం మున్నూరు శివారులో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని జవహర్ భవన నిర్మాణానికి కేటాయిస్తూ పాఠశాల విద్యా కార్యదర్శికి గతేడాది కలెక్టర్ లేఖను సైతం రాశారు. మున్నూరు గ్రామం జాతీయ రహదారి కి మూడు కిలో మీటర్ల దూరంలో ఉండటం, అవసరమైన భూమి ఒకే చోట లభించడం, భవిష్యత్తులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది రాకపోకలకు అనువుగా ఉంటుందని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి జిల్లాలో నవోదయ విద్యా లయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## సామాజిక న్యాయం లోపించింది



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ లా ఉందని, ఇందులో సామాజిక న్యాయం లోపించిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. బడ్జెట్ లో కేటాయించిన నిధులు చూస్తుంటే అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. బడ్జెట్ లో విద్యా, వైద్య రంగాలకు తక్కువ మొత్తంలో నిధులు కేటాయించడం సరికాదన్నారు. వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయించి రైతులను నమ్మించి నట్టేట ముంచేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయించిన ఫలితంగా పేదలకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అనుకూలంగా కేటాయింపులు లేవన్నారు. ప్రధానంగా బీసీలు 56 శాతం ఉంటే మూడు శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 23-03-2026
www.mudranews.in | @mudranews



కారు బ్యాటరీ
కారుకు బ్యాటరీ కండిషన్ చెక్ చేయండి
బ్యాటరీ బాగుంటే స్టార్టింగ్ సమస్యలు ఉండవు.


## ప్రశాంతంగా పీపీటీ ప్రవేశ పరీక్ష



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>

పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రగతి విద్యానికేతన్ పరీక్ష ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంతంగా నిర్వహించారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని తీరందాస్ గోపి మీటింగ్ హాల్ లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రవేశ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలోని అనాథ, పాక్షిక అనాధ, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా హైద్రాబాద్ లోని ప్రగతినగర్ లో రెసిడెన్షియల్ విద్యను అందించడం జరుగుతుదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న జనగాం, నిజామాబాద్ విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. వారం రోజుల లోపు ఈ పరీక్ష ఫలితాలను వెల్లడిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గుజ్జ బాలయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, పరీక్ష పరిశీలకులు ప్రగతి, శ్రీవాణి, జిల్లా కమిటీ సభ్యులు కంచిగట్ల వెంకన్న, కోక వేణు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**- నూతనంగా డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం, నియామక పత్రాలు అందజేత**

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>

కాంగ్రెస్ అభివృద్ధి పథకాలు ప్రజలలోకి తీసుకెళ్ళి బలోపేతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక వివేరా హోటల్ లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ జిల్లా అధ్యక్షుడు బీర్ల ఐలయ్య అధ్యక్షతన డీసీస నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ బడ్జెట్ సమా వేశంలో ప్రతి ఒక్క రేషన్ కార్డు ఉన్న వారికి ఐదు లక్షల రూపాయల బీమా, రేషన్ మరెన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు తీసుకెళ్లాలని అన్నారు.

అనంతరం ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు పదవి వస్తుందని అన్నారు. అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతుల కోసం కాల్వలను పూర్తి చేసి సాగునీరు అందిస్తున్నామన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం రాకముందే స్థాపించిన పార్టీ అని ఇందులో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా నియామకమైన కాంగ్రెస్ డీసీసీ కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు టీపీసీసీ అధ్యక్షుడు అందజేశారు. ముందుగా ప్రభుత్వ విప్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, యాదగిరిగుట్ట చైర్మన్, ఆలేరు చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రమోద్ కుమార్, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, మార్కెట్ చైర్మన్ రేఖా బాబురావు, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్, జిల్లా చైర్మన్ సామర్ల రవీందర్, జనరల్ సెక్రెటరీ వాజిద్, ప్రకాష్, రవీందర్ రెడ్డి, రాజశేఖర్ శ్రీనివాస్, యాదాద్రి భువనగిరి జిల్లా మార్కెట్ చైర్మన్ లు, కౌన్సిలర్స్, సర్పంచులు, మాజీ జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.





## సంఘం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**-ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఇరుకుల వెంకన్న**

<u>ముద్ర, మోత్కూర్:</u>



మోత్కూర్ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడు ఇరుకుల వెంకన్న అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో పట్టణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మొగుళ్ల పెల్లి సోమయ్య గత ఐదు సంవత్సరాలు చేసిన అభివృద్ధి, సంఘం లావాదేవీలు, నిర్వహించిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న పాల్గొన్నారు. అనతరం పట్టణ సంఘం నూతన కమిటీని మండల అధ్యక్షుడు ఇరుకుల వెంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ సంఘం అధ్య క్షుడిగా మొగుళ్ళపల్లి సోమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బండారు రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా మురారి శెట్టి శ్రీధర్, పిఆర్వోగా బద్దిశెట్టి సంతోష్, ఉపాధ్యక్షులుగా బుక్క విశ్వనాథం, సోమ లింగయ్య, అనంతల అశోక్, కార్యదర్శులుగా బుక్క చంద్రశేఖర్, ఇమ్మడి రమేష్, పందిరి వెంకన్న, గౌరవ సలహాదారులుగా బుస్స శ్రీనివాస్, మిట్టపల్లి నాగేష్, గౌరు శ్రీనివాస్,సోమ నర్సయ్య, అనంతుల వెంకటయ్య, పల్లెర్ల వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా మాశెట్టి వెంకన్న, సోమ కార్తీక్ ,రాపాక శంకర్, సోమ కిరణ్, ఇమ్మడి వినోద్, తోనుపునూరి చంద్రశేఖర్, అల్లాడి సోమేశ్వర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సోమ వెంకటేశ్వర్లు, సోమ సంతోష్, తిపిరిశెట్టి శ్రీనివాస్, గౌరు చంద్రశేఖర్, మండల కార్యదర్శి గుండా రాములు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

<u>ముద్ర, మోత్కూర్:</u>



స్నేహితురాలి కుటుంబానికి తమ వంతు ఆర్థిక సాయంగా 2006-07 సంవత్సరం 10వ తరగతి విశ్వభారతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. స్నేహితురాలు మమ్మద్ బిపాషా భర్త రహీం అకాల మృతి చెందడంతో మిత్రులు అందరూ కలిసి రూ.40లు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి పూర్వ ఉపాధ్యాయుడు బయ్యని రాజు, తొట్ల నరేష్, కంసాని రాజిరెడ్డి, అంబటి శ్రీకాంత్, వనం మహేష్, శ్రీకాంత్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, పరశురాములు, దండవేణి మంజుల, గంగుల ప్రియాంక, నిలిగొండ భాగ్యలక్ష్మి, వంగ సంధ్య, మామిడి ఉష, హేమలత, స్వప్న, లోడంగి జ్యోతి, ఎండి బి పాషా తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

<u>ముద్ర, మోత్కూర్:</u>



మోత్కూర్ మున్సిపల్ కేంద్రం లోని హరి విద్యాలయం2006-07 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని తీపి గుర్తులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, రవి,సంపత్, మదన్, కవిత, మానస, రజిని, విద్యార్థులు ధనుంజయ్ ,మహేష్, దయాకర్, శ్రీను, హాజీ, రమేష్, రవీందర్, విమల, ఇంద్రజ, శ్రీలక్ష్మి, మాన్సింగ్ జబ్బర్లాల్, రవి ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమ్మేళనానికి తరలిన పాలడుగు రైతులు

<u>ముద్ర, మోత్కూర్:</u>

డలంలోని పాలడుగు గ్రామ శ్రీ మత్స్యగిరి రైతు ఉత్పతి దారుల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం రైతు సమ్మేళనంలో పాల్గొనేందుకు ఎఫ్ పిఓ పరిధి రైతులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కొంపల్లి లలిత, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల భగవంతు, రైతు సంఘ డైరెక్టర్లు ముక్కముల మత్స్యగిరి,అంతటి వెంకటయ్య, మర్రిపెల్లి యాదయ్య, యాస మాధవి, రైతులు జోరుక బిక్షం, కొంపల్లి గోరయ్య, వల్లపు వెంకన్న, సత్తయ్య, మల్లేష్, చిట్కాలయ్య, గోవిందు, రాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం

## రూ.2 వేల కోట్లు కేటాయించాలి

**- చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకట నర్సు**

<u>ముద్ర, మోత్కూర్:</u>

చేనేత పరిశ్రమ పరిరక్షణ, ప్రభుత్వ హామీల అమలుకు తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో చేనేతకు రూ.2000 కోట్లు కేటాయించాలని కాని బడ్జెట్ లో కేవలం 258 కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం




చేతులు దులుపుకుందని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆదివారం మోత్కూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన చేనేత రుణ మాఫీ, నేతన్న భరోసా దాదాపు సంవత్సరంన్నర గడచిన నిధుల లేమితో ఇప్పటికి అమలు కాలేదని, (త్రిఫ్ట్) నేతన్న పొదుపు పథకంలో కార్మికులు ప్రతినెల ఆర్ డి (వన్)లో జమ చేస్తున్నప్పటికి, ప్రభుత్వం జమ చేయవలసిన ఆర్ డి (టూ)లో దాదాపు పది నెలలుగా పెండింగ్ ఉన్నాయని తెలిపారు. చేనేత కొత్త పెన్షన్ ల కోసం నేతన్నలు ఏండ్లుగా ఎదిరుచూస్తున్నారని, చేనేత కార్మికుడు మరణిస్తే చెల్లించవలసిన ఎక్స్ గ్రేషియా సంవత్సరాలు గడచిన బాధిత కుటుంబాలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ పరిరక్షకు హామీల అమలుకు తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో రూ.2000 కోట్లు కేటాయించాలని 2000 కోట్లు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బస్వాపూర్ ప్రాజెక్టుకు రూ.500 కోట్ల కేటాయించాలి



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u>

బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.500 కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ విమర్శించారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో సీపీఎం ఇంటింటి సమస్యల అధ్యయనంలో భాగంగా గ్రామ సర్పంచ్ రాంపల్లి కృష్ణ, ఉప సర్పంచ్ అందే మల్లేశం, మాజీ సర్పంచ్ మాకొల్ల సత్యంకు కరపత్రం అందించారు. ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోతున్న రైతులు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం మాటలను నమ్మకుండా ప్రాజెక్టు పూర్తి సాయి నిర్మాణం కోసం, నిర్వాసితులకు రావలసిన నష్టపరిహారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని నర్సింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, కార్యదర్శి కూకుట్ల కృష్ణ పాల్గొన్నారు.

## బడ్జెట్ లో దళితులకు తీరని అన్యాయం

<u>ముద్ర, మోత్కూర్:</u>

బడ్జెట్ లో దళితులకు తీరని అన్యాయం చేసిందని సీపీఎం మండల కమిటీ సభ్యుడు కురిమేటి యాదయ్య విమర్శించారు. మోత్కూర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బడ్జెట్ లో ఎస్సి సంక్షేమానికి రూ.40,232 కోట్లు కేటాయించగా ఈసారి కేవలం రూ.11,784 కోట్లు మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయమని అన్నారు. దళితుల అభివృద్ధి పేరుతో అనేక మాటలు చెప్పి ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమైందని అన్నారు.

### చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం

## రిలే దీక్షలను విజయవంతం చేయండి

**- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్**

<u>ముద్ర, వలిగొండ:</u>




చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23 నుంచి హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే రిలే దీక్షలను విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు పోరాటాల ఫలితంగా సాధించుకున్న పథకాలైన జాతీయ చేనేత బోర్డు, హ్యాండీక్రాఫ్ట్ బోర్డు, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్, హౌస్ కం వర్క్ షెడ్ పథకాలను అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమ ముడి సరుకులైన రంగులు రసాయనాలతో పాటు చేనేత చీరలపై జీఎస్టీ విధించి దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమను చావు దెబ్బతీసిందని విమర్శించారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో హైదరాబాద్ లో నిర్వహించే రిలే దీక్షను చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు గర్దాసు నరసింహ, దొంత శంకరయ్య, జెల్ల నరేందర్, సాయిని యాదగిరి, గంజి వెంకటేశ్వర్లు, గుంటి రవీందర్, జెల్ల నరహరి, రాపోలు శ్రీనివాస్, మిర్యాల వెంకటేశం, అయిటిపాముల మీనయ్య, మిర్యాల శేఖర్, రచ్చ సంతోష్, చిందం సత్తయ్య, కర్నాటి వెంకటేశం, మూడుదుడ్ల శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంకెలగారడీ బడ్జెట్ లో అన్ని వర్గాలకు అన్యాయం

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి**

<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u>

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అంకెల గారడీ బడ్జెట్ లో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నీ వర్గాలను నిరాశపరిచిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 11 డిక్లరేషన్ లకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు ఏడాదికి రూ.20 వేల కోట్లు ఐదేండ్లకు లక్ష కోట్లు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు కేవలం 3.85 శాతం మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. బీసీ గురుకులాల్లో అన్నం సరిగ్గా లేక విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని, మైనారిటీ గురుకులాల్లో వసతులు లేక ఖాళీ అవుతున్నాయన్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్నం పెట్టె రైతు ఇబ్బందుల్లో ఉన్నాడని, రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. కరెంటు సరిగ్గా లేదన్నారు. అన్నీ పార్టీలు రాజకీయాలకు అతీతం గా అన్నీ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందే బడ్జెట్ రూపకల్పన చేసేందుకు ప్రభు త్వం పై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ జెడ్పి టిసి సుబ్బురు బీరు మల్లయ్య, మాజీ ఎం పీపీ అతికం లక్ష్మీనారాయణ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ చీమల రాజు, టీఆర్ఎస్ నాయకులు ఇట్టబోయిన గోపాల్, చేన్న మహేష్, ర్యాకల శ్రీనివాస్, అజీముద్దిన్, సూరి పంగా సుభాష్, గుజ్జ పవన్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## కారుకు ఫ్యూయల్ ఎఫిషియెన్సీపై దృష్టి పెట్టండి

సడన్ బ్రేకులు, వేగంగా యాక్సిలరేట్ చేయడం తగ్గించండి.



# సిద్దిపేటలో హరీష్‌ను ఓడిస్తే మంత్రి పదవి

- రైతులు పంట మార్పు చేయండి : సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

రైతులు పంట మార్పిడి ద్వారా అధిక లాభాలు సాధించాలని, అలాగే 2029లో సిద్దిపేటలో కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మేట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకం కింద నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. తొలి విడతగా 70 లక్షల మంది రైతులకు రూ.3,600 కోట్లను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే 40 రోజుల్లో మిగిలిన రూ.9,000 కోట్లను కూడా పూర్తిగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ కాలంలో ఏర్పడిన ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. రైతు పక్షపాత ప్రభుత్వంగా, పంటకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 70 లక్షల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

### ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం..

నర్మేటలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల నిధులు కేటాయించి పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులకు అధిక లాభాలు అందేలా ఈ ఫ్యాక్టరీ ఉపయోగపడుతుందని, పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు.



### కొడంగల్‌లోనూ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి..


కొడంగల్‌లో కూడా ఇలాంటి ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు సూచించారు. అక్కడి రైతులకు లాభం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### మహిళలు, యువతకు ప్రాధాన్యం..

రాష్ట్రంలో మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 67 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వాటిని కోటి సంఖ్యకు పెంచుతామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడం లక్ష్యమన్నారు. యువతకు ప్రతి జిల్లాలో ఏటీసీ సెంటర్ల ద్వారా నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలు అందిస్తున్నామని వివరించారు.

### సిద్దిపేటలో మార్పు అవసరం..

సిద్దిపేటలో ఒకే కుటుంబానికి అవకాశాలు ఇస్తున్న పరిస్థితి మారాలని, మార్పు వస్తే అభివృద్ధి సాధ్యమని సీఎం అన్నారు. తాను ఎమ్మెల్యేల కోసం కాదు, ప్రజల కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. సిద్దిపేట ఇంచార్జి మంత్రి వివేక్ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



## దుబ్బాక సమస్యలు పరిష్కరించండి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా నర్మేట్ట గ్రామంలో సీఎం పర్యటనలో ఎనిమిది ముఖ్యాంశాలతో సీఎం రేవంత్ రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు వినతి పత్రం ఇచ్చారు. గజ్వేల్లో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలకు కాలువల ద్వారా నీళ్లు అందించాలన్నారు. తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని ఎనిమిది గ్రామాలకు నీళ్లు అందించాలన్నారు. 765 డిజి జాతీయ రహదారి హబ్సిపూర్ నుంచి దుబ్బాక అంబేద్కర్ విగ్రహం వరకు నాలుగు లైన్ల రోడ్డు వేయాలని కోరారు. ఎనగుర్తి చౌరస్తా నుంచి బొప్పాపూర్ మీదుగా శిలాజీ నగర్ కు డబుల్ రోడ్డు మంజూరు చేయాలన్నారు. కొండపాక మండల కేంద్రంలో కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మెదక్ జిల్లా, సంగారెడ్డి జిల్లాలో ఆయిల్ ఫామ్ కంపెనీల ఏర్పాటు వెంటనే చేయాలని వినతి చేశారు. ఈ సందర్బంగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## నూతన ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి నియోజకవర్గంలో నూతనంగా గెలిచిన ముదిరాజ్ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లను పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, సదాశివపేట, సంగారెడ్డి మున్సిపాలిటీల్లో గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ముదిరాజుల జనాభా అధికంగా ఉన్నప్పటికీ సామాజిక, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబడి ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ముదిరాజ్ అభ్యర్థులు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లుగా ఎదగడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ముదిరాజులను బీసీడి నుంచి బీసీఏకి మార్చుతామని ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా పార్టీలకతీతంగా అందరూ కలిసి పని చేయాలని సూచించారు.

## 24న కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన

- టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి
- ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి పిలుపు

**ముద్ర ప్రతినిధి, మెదక్,:**

మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఈనెల 24న నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె. యాదగిరి, ప్రధాన కార్యదర్శి పి. వెంకట్ రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తక్కువ కేటాయింపులు చేసి ప్రకటిత విద్యా లక్ష్యాలను వమ్ము చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత బడ్జెట్ లో గతంతో పోలిస్తే కేవలం 0.63 శాతం మాత్రమే నిధులు పెంచారన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక ప్రకారం నిర్లక్ష్యానికి గురైన విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలంటే, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కింది డిమాండ్లను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. 24న మంగళవారం మధ్యాహ్నం 1 గంటలకు మెదక్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగానికి నిధులను 20 శాతానికి పెంచాలని, రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ ప్రయోజనాల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంగా విడుదల చేయాలని, టీచర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పీఆర్సీ ప్రకటన చేయాలని, పాఠశాల విద్యాశాఖలోని ఎంఈఓ, డిప్యూటీ ఈవోలు ఖాళీలను భర్తీ చేయాలని, నూతనంగా ఏర్పడిన జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులను మంజూరు చేయాలని, డైట్లలో లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, అన్ని జిల్లాల్లో ఈఎల్టీసీ కేంద్రాలను ప్రారంభించి ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించాలని డిమాండ్ చేశారు.




# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సమస్యలకు నిలయాలు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణంలోని 12వ వార్డు పిల్లికొట్టాల్లోని డబుల్ బెడ్రూం కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య ఆరోపించారు. ఈ నెల 1 నుంచి 24 వరకు స్థానిక సమస్యలపై నిర్వహిస్తున్న క్షేత్ర పర్యటనలో భాగంగా ఆదివారం సిపిఎం మెదక్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంది. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. పిల్లికొట్టాల్లోని డబుల్ బెడ్రూం కాలనీలో 1,060 మంది పేదలు నివాసం ఉంటున్నారని తెలిపారు. నాలుగేళ్ళ క్రితం ఇండ్లు కేటాయించినప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, సీసీ రోడ్లు లేకపోవడం వల్ల వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇండ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో చీడపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని చెప్పారు. మంచినీటి కొరత తీవ్రంగా ఉందని, రోజుకు కేవలం 20 నిమిషాలపాటు మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. బోరు చెడిపోయి సంవత్సరం గడిచినా మరమ్మతులు చేయలేదని, 56వ బ్లాక్‌లో నీటి సరఫరా లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఇంకా, డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ నాణ్యతపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పెచ్చులు ఊడిపోవడం, స్లాబ్‌ల నుంచి నీరు కారడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశముందని హెచ్చరించారు. కాలనీలో పార్కులు అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, అలాగే మంజూరైన ఇండ్లు వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాలనీ అభివృద్ధి కోసం మున్సిపాలిటీ నిధుల నుంచి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం 24న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ మాట్లాడుత.., కాలనీ అభివృద్ధి పట్ల మున్సిపల్ అధికారులకు చిత్తశుద్ధి లేదన్నారు. రోడ్లపై చెత్త పేరుకుపోతున్నా శుభ్రపరిచే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించకపోవడం, నిర్మాణంలో ఉన్న బ్లాక్‌లను పూర్తి చేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మెదక్ పట్టణ కమిటీ కన్వీనర్ జె. సంతోష్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు అజయ్ కుమార్, నాయకులు షౌకత్, వెంకట్, యాదగిరి, కాలనీ వాసులు మహమ్మద్ ఆఫ్జల్, మహబూబ్ ఖాన్, మంగ్లీ, హైదర్ తదితరులు పాల్గొన్నారు.








## హాస్పిటల్ నిర్మాణ పనుల పరిశీలన

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న గ్రామ ప్రజల కోరికను మంత్రి నెరవేర్చారని, దీంతో వారి ఆకాంక్షలు నెరవేరబోతున్నాయని తెలిపారు. సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పన కోసం మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. త్వరలో గ్రామ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అదేవిధంగా కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంట మాజీ సర్పంచ్ చందులత, వీరమల్లప్ప, పట్లోళ్ల రాజు పటేల్, దోడ్డోళ్ల కిష్టయ్య, గున్నాల నాగప్ప, వారాది శంకరప్ప, సిద్దారెడ్డి, గొల్ల నాగేందర్, బేగరి మణి, శంకరయ్య, వరప్రసాద్, రిపోర్టర్ మన్నే నాగేష్, పెద్దగొల్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కుల్చారంలో వైభవంగా కాళికాదేవి రథోత్సవం



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ మండలంలోని కుల్చారం గ్రామంలోని శ్రీ కాళికాదేవి అమ్మవారి ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే ఉగాది ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా అమ్మవారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై అమ్మవారు కొలువుదీరి గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు "జై కాళికాదేవి" నినాదాలతో కుల్చారం వీధులు మారుమ్రోగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కమ్మరి శ్రవణ్ చారి, దుర్గాప్రసాద్ చారి, దశరథం చారి, అశోక్ చారి, కృష్ణమూర్తి చారి, కరుణాకర్ చారి, పాండురంగ చారి, వడ్ల ప్రభాకర్ చారి, వడ్ల కృష్ణమూర్తి చారి, వడ్ల శ్రీనివాస్, నర్సింలు చారి, మురళి చారి, వడ్ల బ్రహ్మం, వీరస్వామి చారి, ఎల్లయ్య చారి, శివకుమార్ చారి, కావేశ్వర్, హరీశ్, ఈశ్వర్, సాయికిరణ్, సంతోష్, నవీన్, భూమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews




కారుకు ఇన్సూరెన్స్ అప్డేట్ ఉంచండి
ఎప్పటికప్పుడు ఇన్సూరెన్స్ రిన్యూ చేయడం తప్పనిసరి.



# పాలనలో మోదీ రికార్డు

- మరో అరుదైన మైలురాయి
- 8,931 రోజుల పాలనతో మోదీ చరిత్ర సృష్టి
- చామ్లింగ్ రికార్డును అధిగమించిన ప్రధాని మోదీ
- సీఎం నుంచి పీఎం వరకు నిరవధిక పాలనలో మైలురాయి
- మూడోసారి ప్రధాని.. వరుస విజయాలతో మోదీ దూసుకెళ్తూ
- నెహ్రూ రికార్డుకు సమం.. దేశ రాజకీయాల్లో మోదీ ఆధిపత్యం



**ముద్ర డెస్క్:**

ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ జీవితంలో మరో కీలక మైలురాయిని అందుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా కలిసి, అనంతరం దేశ ప్రధానిగా మొత్తం 8,931 రోజుల పాటు నిరవధికంగా ప్రభుత్వ అధిపతిగా పనిచేసి కొత్త రికార్డు నెలకొల్పారు. ఈ కోరిక సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరుతో ఉన్న 8,930 రోజుల రికార్డును అధిగమించారు. 2001లో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు, 2014 వరకు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఇప్పటికీ పదవిలో కొనసాగుతున్నారు. అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా గౌరవించిన నాయకుడిగా ఇప్పటికే గుర్తింపు పొందారు. అలాగే ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవం కలిగిన ప్రధానిగా కూడా ప్రత్యేక స్థానం సంపాదించారు. స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలంగా కొనసాగుతున్న కాంగ్రెసేతర తొలి నాయకుడు మోదీ కావడం విశేషం. అక్కడ రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసి, మూడోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెసేతర పార్టీ నేతగా కూడా ఆయన రికార్డు సృష్టించారు. ఇక వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీని విజయపథంలో నడిపిస్తూ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మూడు సార్లు ఎన్నికల విజయ రికార్డును సాధించారు. గత ఏడాది జులైలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి, దేశంలో అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా నిలిచారు. అదే విధంగా వరుసగా ఆరు ఎన్నికల్లో పార్టీకి ఒకే నాయకత్వం వహించి విజయం సాధించిన ఏకైక నేతగా మోదీ నిలిచారు. 2002, 2007, 2012లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా, 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానిగా పదవులు పొందారు. ఈ రికార్డులతో దేశ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం మరింత బలపడింది.

# అణు కేంద్రాలే లక్ష్యం..

- వినాశనం అంచున ప్రపంచం!
- నటాంజ్ ప్లాంట్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడి
- ప్రతీకారంగా డిమోనాపై క్షిపణుల వర్షం కురిపించిన ఇరాన్
- 48 గంటల అల్టిమేటం జారీ చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు

**ముద్ర డెస్క్:**

పశ్చిమాసియాలో యుద్ధం భీకర రూపం దాల్చింది. ఇప్పటి వరకు చమురు క్షేత్రాలు, సైనిక స్థావరాలకే పరిమితమైన దాడులు.. ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైన అణు కేంద్రాల వైపు మళ్లాయి. ఇరాన్‌లోని నటాంజ్ అణు ఇంధన కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించగా, దానికి ప్రతీకారంగా ఇరాన్ శనివారం రాత్రి ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు పరిశోధన కేంద్రం సమీపంలో క్షిపణులతో విరుచుకుపడింది. ఈ పరిణామాలు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయేమోనన్న భయాందోళనలు ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.

**నటాంజ్ టార్గెట్‌గా ఇజ్రాయెల్ వ్యూహం**

శనివారం తెల్లవారుజామున ఇరాన్‌లోని నటాంజ్ అణు ఇంధన శుద్ధి కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా వైమానిక దాడులు నిర్వహించాయి. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు సమాచారం. అయితే, ఈ దాడిలో ఎటువంటి రేడియోధార్మికత వెలువడలేదని ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థ (IAEA) ధృవీకరించింది.

**డిమోనాపై క్షిపణుల వర్షం**

నటాంజ్ దెబ్బకు ఇరాన్ గట్టిగానే బదులిచ్చింది. ఇజ్రాయెల్ అణుశక్తికి నిలయమైన డిమోనా నగరాన్ని లక్ష్యంగా చేసుకుని డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇజ్రాయెల్ రక్షణ కవచాలను ఛేదించుకుని కొన్ని క్షిపణులు జనావాసాలపై పడటంతో సుమారు 180 మందికి పైగా గాయపడ్డారు. డిమోనాలోని అణు కేంద్రానికి ప్రమాదం కలగనప్పటికీ, యుద్ధం ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి.

**అమెరికా హెచ్చరిక:**

**'దెబ్బ చాలా గట్టిగా ఉంటుంది'**

ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ తన తీరు మార్చుకోకపోతే ఆ దేశంలోని అతిపెద్ద విద్యుత్ ప్లాంట్లను, మౌలిక సదుపాయాలను "మటుమాయం" చేస్తామని హెచ్చరించారు." హార్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవాలి. లేదంటే ఇరాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈసారి దెబ్బ చాలా గట్టిగా ఉంటుంది" అని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా అల్టిమేటం జారీ చేశారు.

**గడగడలాడుతున్న ప్రపంచం**

అణు కేంద్రాలపై దాడులు జరగడం వల్ల ఒక్కసారిగా అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, ఇంధన సరఫరాపై ఈ యుద్ధ ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అటు ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరెస్ స్పందిస్తూ.. "మానవజాతి అణ్వాయుధాల నీడలో మనుగడ సాగించలేదు, తక్షణమే సంయమనం పాటించాలి" అని కోరారు.

**ముందుందు ఏం జరగబోతోంది?**

48 గంటల గడువు ముగిశాక అమెరికా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఇరాన్ తన పట్టు వీడుతుందా లేదా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా పశ్చిమాసియా పరిణామాలు ప్రపంచాన్ని వినాశనం అంచుకు తీసుకెళ్తున్నాయన్నది అక్షర సత్యం.



# బిల్డింగ్ రూల్స్ లో మార్పులు

- టీడీఆర్ వినియోగం, హై-రైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై మార్గదర్శకాలు
- ఉత్తర్వులు జారీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో భవన నిర్మాణ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు చేసింది. ఇందులో భాగంగా 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012'కు కీలక సవరణలు చేస్తూ ఆదివారం జీవో.95 విడుదల చేసింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ జీవోలో టీడీఆర్ వినియోగం, హైరైజ్ భవనాల గుర్తింపు, సెట్ బ్యాక్ సడలింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి.



**హై-రైజ్ భవనాల కొత్త నిర్వచనం**

ఇకపై 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే 'హైరైజ్' భవనాలుగా పరిగణిస్తారు. పారిశ్రామిక భవనాల్లో ఉండే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, బాయిలర్ రూములు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులు, ఇతర నిర్మాణ ఫీచర్లను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు.

**టీడీఆర్ వినియోగంపై కఠిన నిబంధనలు**

**చిన్న ప్లాట్లకు నిబంధన:**

750 చ.మీ నుంచి 2,000 చ.మీ మధ్య ఉండే ప్లాట్లలో 18 మీటర్ల నుంచి 21 మీటర్ల ఎత్తు వరకు భవనాలు నిర్మించాలంటే టీడీఆర్ వినియోగం తప్పనిసరి.

**భారీ భవనాలపై లోడింగ్:** 10 అంతస్తుల నుంచి 20 అంతస్తుల లోపు ఉండే భవనాలకు, 10 అంతస్తుల పైబడిన బిల్ట్‌అప్ ఏరియాపై 3 శాతం టీడీఆర్ లోడింగ్ ఉండాలి.

20 అంతస్తుల పైబడిన భవనాలకు, 20 అంతస్తుల పైబడిన ఏరియాపై 5 శాతం టీడీఆర్ వినియోగించాల్సి ఉంటుంది.

**సమర్పణ విధానం:** బిల్డింగ్ పర్మిషన్ సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలి. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందే ముందు సమర్పించడం తప్పనిసరి.

**అదనపు అంతస్తులకు వెసులుబాటు**

2,000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**40 ఫీట్ల రోడ్డు:** 3 అదనపు అంతస్తుల వరకు అనుమతి.

**60 ఫీట్ల రోడ్డు:** 4 అదనపు అంతస్తుల వరకు అనుమతి.

**80 ఫీట్ల రోడ్డు:** 5 అదనపు అంతస్తుల వరకు అనుమతి.

హైరైజ్ భవనాల్లో టీడీఆర్ వినియోగం ద్వారా అనుమతించబడిన సెట్‌బ్యాక్స్‌లో 10 శాతం వరకు రిలాక్సేషన్ పొందే అవకాశం కల్పించారు. అయితే, భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్ బ్యాక్ ఉండాలనే నిబంధనను కచ్చితంగా పాటించాలి. ఒకవేళ మాస్టర్ ప్లాన్ రోడ్లను మార్చినప్పుడు, తొలగించినప్పుడు, దరఖాస్తుదారులు వర్తించే కన్వర్షన్ ఛార్జీలు చెల్లించడం, దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో నగరంలో నిలువు అభివృద్ధి పెరుగుతుందని, అలాగే పారదర్శకమైన భవన నిర్మాణ ప్రక్రియకు వీలు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమలులోకి రానున్నాయి.

## అదుపు తప్పిన పరిస్థితి..

# బాసర ట్రిపుల్ ఐటీకి సెలవులు

- విద్యార్థి ఆందోళనల మధ్య బాసర ట్రిపుల్ ఐటీలో అకస్మాత్తుగా సెలవుల ప్రకటన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా బాసర ఐఐటీ కి సెలవులు ప్రకటిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పీయూసీ మొదటి రెండు సంవత్సరాలు, ఇంజనీరింగ్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు సెలవులు ప్రకటిస్తూ ఊహించని రీతిలో యాజమాన్యం
నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా యాజమాన్యానికి, విద్యార్థులకు మధ్య ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో సెలవుల ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉండగా ట్రిపుల్ ఐటీలో నిధుల దుర్వినియోగం జరిగిందని, విచారణ చేపట్టాలని కోరుతూ విద్యార్థులు




అధికారులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో తమ జీవితాలకు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థుల ఆందోళనలు కొనసాగిస్తున్నారు. క్యాంపస్ విషయాలు బయటకు వస్తే చర్యలుంటాయని విద్యార్థులను అంతర్గతంగా హెచ్చరిస్తున్న క్రమంలో వివరాలు బయటకు వస్తలేవు. అధికారులు సైతం అన్ని రకాలుగా తమను బెదిరిస్తున్నారని పేరు వెల్లడించని విద్యార్థి ఒకరు వివరించారు. ప్రభుత్వ పరంగా క్యాంపస్ లో జరుగుతున్న అంతర్గత విభేదాలపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## రైతు సంక్షేమానికి రూ.1.09 లక్షల కోట్లు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో జరిగిన రైతు ఉత్సవాల్లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం గత రెండేళ్లలో రూ.1.09 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. సుమారు రూ.21 వేల కోట్లు వెచ్చించి 25 లక్షలకుపైగా రైతులకు రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌గా రూ.3,096 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లక్ష ఎకరాల్లో పామ్ ఆయిల్ సాగు విస్తరించినట్లు వెల్లడించారు. పామ్ ఆయిల్ రైతులకు అండగా ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించడం సంతోషకరమన్నారు. రైతులు, మహిళలు సహా అన్ని వర్గాల సంక్షేమంతో పాటు యువతకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# దురంధర్ -2కు దేశ ప్రజల బ్రహ్మారథం

- దేశ వ్యాప్తంగా హౌస్‌ఫుల్ షోలు
- విమర్శల మధ్య కలెక్షన్ల సునామీ
- మూడు రోజుల్లోనే ఈ చిత్రం రూ. 500 కోట్ల గ్రాస్ వసూళ్లు
- బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ
- జనాలు ఎగబడి చూసేంతగా ఇందులో ఏముంది?

**ముద్ర డెస్క్:**

దురంధర్ 2 అంచనాలకు మించి ఆడుతోంది. బాక్సాఫీస్ లెక్కలను మొత్తం తారుమారు చేస్తోంది. సినీ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేసే విధంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడ చూసినా సరే దురంధర్ 2 సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్లు జన జాతరను తలపిస్తున్నాయి.

దురంధర్ 2 సినిమా ఇండియన్ సినిమా చరిత్రలోనే అతిపెద్ద బ్లాక్ బస్టర్ అయిన నేపథ్యంలో కొంతమంది కుహనా లౌకికవాదులు తెరపైకి వచ్చారు. సినిమా గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఈ సినిమా కొంతమంది వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసిందని పేర్కొంటున్నారు. దురంధర్ 2 సినిమా అనేది ఒక ప్రాపగాండా అని.. ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమాను ప్రాపగాండా అనుకుంటే.. దశాబ్దాల బాలీవుడ్ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. ఎవరిని ఎవరు టార్గెట్ చేశారు.. మెజారిటీ వ్యక్తుల సమూహాన్ని ఎలా దెబ్బతీశారో అర్థమవుతుంది..

**ఫైర్**

ఈ సినిమా ఒక నవల ఆధారంగా తీశారు. ఆ నవలలో పాత్రల పేర్లు బేగం జాన్, రబ్బో..

**స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్**

ఈ సినిమాలో హీరోయిన్ చేసిన ఒక పాట చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. సె రాధాబాడీ అనే పాటకు డ్యాన్స్ చేస్తూ ఉంటుంది.. ఆ పాట వచ్చినంతసేపు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇలా చెప్పుకుంటూ పోతే బాలీవుడ్ పెద్దలు చేసిన నెగటివ్ ప్రాపగాండ మామూలుది కాదు.

అయితే సినిమాలో మాత్రం వాటికి రాధ, సీత అని పేరు పెట్టారు .

**షేర్ని**

ఈ సినిమా ఫారెస్ట్ ఆఫీసర్ కె.ఎం. అభర్ణ జీవిత చరిత్ర ఆధారంగా తీశారు. ఫారెస్ట్ ఆఫీసర్ అభర్ణ జీవిత వృత్తాంతంలో అస్గర్ అలీ అనే వేటగాడు ఉన్నాడు . అభర్ణ రియల్ లైఫ్ లో వృత్తాంతాలను సినిమాటిక్ గా చూపించారు.. ఆ సినిమాకు షేర్ని అని పేరు పెట్టారు..ఆ సినిమాలో మాత్రం ఆఫీసర్ పేరు విద్యా విన్సెంట్ అని మార్చారు. విలన్ పేరు రంజన్ రాజ్ హంస్ అని పేర్కొన్నారు.

**పీకే**

ఈ సినిమా లో శివుడు భయంతో పరుగులు తీస్తున్నట్టుగా చూపించారు. వాస్తవానికి శివుడు అనేవాడు ధైర్యానికి ప్రతిరూపం. అతడు లయకారుడు కూడా. అతడు లేనిది సృష్టి లేదు. కానీ ఈ సినిమాలో శివుడు అనేవాడు పిరికివాడు అన్నట్టుగా చూపించారు.

**చెక్ ద ఇండియా**

ఈ సినిమా రియల్ లైఫ్ కోచ్ రంజన్ నేగి. కానీ ఈ సినిమాలో మాత్రం షారుక్ ఖాన్ పాత్రకు కబీర్ ఖాన్ అని పేరు పెట్టారు. అన్యాయానికి గురైన ఒక ముస్లిం యువకుడిగా కబీర్ ఖాన్ ను చూపించారు.

**రామ్ తేరీ గంగా మైలి**

ఈ సినిమాలో ఓ పండితుడు కథానాయికపై దారుణానికి పాల్పడతాడు. ఆ తర్వాత అతడు ఓం నమశ్శివాయ అంటూ మంత్రాన్ని జపిస్తుంటాడు.

**దివార్**

ఈ సినిమాలో హీరో ఒక గుడికి వెళ్లుతుంటాడు. అక్కడికి వెళ్లి తనకు దేవుడి మీద నమ్మకం లేదని చెప్తుంటాడు. అయితే అతడి చేతికి మాత్రం 786 అనే సింబల్ ఉన్న బిళ్లను కట్టుకుంటాడు. 786 నంబర్ అనేది దేనికి ప్రతీకనో చెప్పాల్సిన అవసరం లేదు.

**మదర్ ఇండియా**

ఈ సినిమాలో విలన్ పేరు సుఖీలాలా.. అతడు హీరోయిన్ ను వేధించడానికి ముందు దేవి మాతను మనసులో నిత్యం తలచుకుంటాడు.

**రెడీ**

ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ ఒక వ్యక్తి జుట్టును కత్తిరిస్తుంటాడు.. జుట్టు మాత్రమే కదా కత్తిరిస్తున్నాం.. సున్తీ చేయడం లేదు కదా అంటూ డైలాగ్ వదులుతాడు.




**దబాంగ్**

ఈ సినిమాలో విలన్ పేరు చెది సింగ్.. అతడు చుల్బుల్ పాండేను చంపాలని తన మనుషులకు ఆదేశాలు జారీ చేస్తాడు. దానికంటే ముందు హనుమంతుడికి పూజలు చేస్తుంటాడు.

**కారు శుభ్రంగా ఉంచండి**

ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ క్లీన్‌గా ఉంటే వాహనం విలువ పెరుగుతుంది.

# దిగొచ్చిన ఏపీ.. మళ్లీ నంది అవార్డులు!



- గద్దర్ అవార్డు ఫంక్షన్ లో చిరంజీవి వ్యాఖ్యలు వైరల్
- సినీ ఇండస్ట్రీలో పెరిగిన డిమాండ్
- తప్పనిసరి అంటూ సమర్థించుకున్న ఏపీ
- హడావిడిగా ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి ప్రకటన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో నిర్వహించిన గద్దర్ అవార్డుల కార్యక్రమం ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వేడుకలో మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఏపీ ప్రభుత్వం స్పందించింది. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ త్వరలోనే నంది అవార్డులను పునఃప్రారంభిస్తామని ప్రకటించారు. చిరంజీవి నంది అవార్డులు తెలుగు సినీ పరిశ్రమకు అత్యున్నత గౌరవమని పేర్కొంటూ, అవి తిరిగి ప్రారంభిస్తే కళాకారులకు ఉత్తేజం లభిస్తుందని అన్నారు. గత కొన్నేళ్లుగా అవార్డులు నిలిచిపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి దుర్గేష్, 2019-2024 కాలానికి సంబంధించిన అవార్డులపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని తెలిపారు. పాత విధానాన్నే కొనసాగించాలా లేదా కొత్త విధానం తీసుకురావాలా అన్న దానిపై చర్చ జరుగుతోందన్నారు. అలాగే నంది నాటకోత్సవాలను కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సినీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విశాఖపట్నాన్ని అంతర్జాతీయ స్థాయి షూటింగ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిణామాలతో ఏపీలో సినీ రంగానికి మళ్లీ ఊపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# బార్ అసోసియేషన్ ఎన్నికల్లో బహుజనులనే గెలిపిద్దాం

- బీసీ లాయర్స్ అసోసియేషన్ పిలుపు

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలోని హైకోర్టు, జిల్లా, మున్సిఫ్ కోర్టులలో 26న జరగనున్న బార్ అసోసియేషన్ బహుజనులను గెలిపిద్దామని బీసీ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు పిలుపునిచ్చింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ టి. రాజు, ప్రధాన కార్యదలలర్శి శ్రీ పొన్నం దేవరాజు గౌడ్ మాట్లాడుతూ బహుజన వర్గాలకు చెందిన అభ్యర్థులలో గెలుపు అవకా శాలు ఉన్న అభ్య ర్థులను గుర్తించి, వారికి మాత్రమే ఓటు వేసి గెలిపించాల ని సూచించింది. ఓటు మార్పిడి ద్వారా ఐక్యతను ప్రదర్శించి, న్యాయవ్యవస్థలో బహుజన ప్రతినిధిత్వాన్ని పెంచాలని పిలుపునిచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయిల లో అగ్రవర్ణాలే అధికంగా కొనసాగుతున్నారని, వ్యవస్థాత్మకంగా అదే వర్గాలకు అధిక ప్రాధాన్యం లభించే విధంగా పరిస్థితులు రూపొందించబడ్డాయని విమర్శించారు. రిజర్వేషన్లకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా వస్తున్న తీర్పులు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయని, ముఖ్యం గా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అందుకు ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బహుజన వర్గాలకు చెందిన న్యాయవాదులు చురుకైన పాత్ర పోషించి, తమ హక్కులను సాధించుకునేందుకు సంఘటితంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, తమ వాటా తమకు దక్కాలనేదే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో బహుజన నాయకత్వాన్ని నిలబెట్టుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ సమాజంలో ఆత్మ గౌరవం కొరకు తమదైన వాటా కొరకు అధికారం కృషి కొరకు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఇందుకొరకు బీసీ లాయర్ అసోసియేషన్ చేస్తున్న కృషి ని ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో కోల జనార్ధన్ రంగయ్య న్యాయవాదులు సామ్రాట్ రాహుల్ సంతోష్ విక్రమ్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షలు దాటితే పాన్ తప్పనిసరి

- ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు

**ముద్ర, డెస్క్ :**




కేంద్ర ప్రభుత్వం శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) కార్డు వినియోగంపై కీలక మార్పులు చేసింది. కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు 2026 ప్రకారం ఏప్రిల్ 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ ఖాతాల్లో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు జమ లేదా ఉపసంహరణ జరిగినా పాన్ వివరాలు ఇవ్వడం తప్పనిసరి. అలాగే ఇళ్లు, స్థలాల కొనుగోలు వంటి స్థిరాస్తి లావాదేవీలు రూ.20 లక్షలు దాటితే పాన్ తప్పనిసరి అవసరం ఉంటుంది. ద్విచక్ర వాహనాలు సహా ఏ మోటారు వాహనం ధర రూ.5 లక్షలు మించినా కూడా పాన్ సమర్పించాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్ చెల్లింపులు రూ.1 లక్ష దాటితే పాన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదనంగా ఇకపై అన్ని బీమా పాలసీలకు పాన్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ మార్పులతో పెద్ద మొత్తాల లావాదేవీలపై పారదర్శకత పెరగడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం

- కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే
- గ్యాస్, ఆయిల్ ధరల పెంపుతో రవాణా రంగంపై ప్రభావం
- ట్రంప్‌ను నిలదీయడంలో మోదీ మౌనం
- మోదీపై చంద్రబాబు ఒత్తిడి తేవాలి
- 29న హైదరాబాద్‌లో "నో వార్" భారీ ప్రదర్శన
- తిరుమలకు అపకీర్తి తెచ్చే వారిని పదవిలో ఉంచుతారా?
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె. నారాయణ

**ముద్ర, విజయవాడ:**



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేపడుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా సంక్షోభానికి గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ యుద్ధం ద్వారా అమెరికాలోని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుతున్నాయని సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె. నారాయణ అభిప్రాయపడ్డారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యుద్ధం వల్ల భయానకమైన మరణాలు సంభవిస్తున్నా, దాన్ని నివారించాలని అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో ప్రధాని మోదీ వైఖరి ప్రశ్నార్థకరంగా ఉందన్నారు. యుద్ధం ప్రధానంగా చమురు వనరులపై ఆధిపత్యం సాధించేందుకు, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికి డోనాల్డ్ ట్రంప్ చేపడుతున్న చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే భారత్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు ధరల పెరుగుదల రవాణా రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు మూతపడిన సందర్భాలున్నాయని, దీని ప్రభావం నేరుగా కార్మిక, శ్రామిక వర్గంపై పడుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత దేశ ప్రధాని ఈ పరిస్థితుల్లో మౌనం పాటించడం సమంజసం కాదన్నారు. ముందుగా ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని ట్రంప్‌పై మోదీ ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ యుద్ధ అంశంపై మోదీపై ఒత్తిడి తేగల నాయకుడు సీఎం నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతిస్తున్న చంద్రబాబు, ట్రంప్‌కు మోదీ మద్దతు పలకకుండా యుద్ధాన్ని ఆపాలంటూ ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా చంద్రబాబు ముందుకు రావాలని ఆయన సూచించారు. అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లో 'నో వార్' (యుద్ధం వ్యతిరేక) పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భారీ శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అపకీర్తి తెచ్చే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని చైర్మన్ పదవిలో కొనసాగించడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. భక్తుల విశ్వాసానికి సంబంధించిన దేవాలయానికి చైర్మన్‌గా భక్తులను నియమించాలి గానీ, వ్యాపారవేత్తలను, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని నియమించడం సరికాదన్నారు. అమరావతి రాజధానిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ఈ విగ్రహ నిర్మాణాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం తగదన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఈ నిర్మాణం జరగాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు విడిపోయినప్పటికీ తెలుగువారి గుండెల్లో పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన్ని ఒకే కులానికి పరిమితం చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి నరసింహరావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయనపై వ్యక్తిగతంగా గౌరవం ఉన్నప్పటికీ, అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. తన మిత్రుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి భార్య విజయలక్ష్మి విడుదల చేసిన లేఖపై మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు వేర్వేరు రాజకీయ పార్టీల్లో ఉండటం సహజమని, అయితే ఆస్తుల కోసం బహిరంగంగా వివాదాలు జరగడం బాధాకరమన్నారు. వైఎస్ కుటుంబంలో ప్రస్తుతం జరుగుతున్న ఆస్తి వివాదాలపై విచారం వ్యక్తం చేశారు. వ్యక్తిగత ఆస్తి వివాదాలు న్యాయపరంగా, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రాజకీయ అంశాలపై చర్చించడం సహజమే అయినప్పటికీ, కుటుంబ వ్యవహారాలను బహిరంగంగా తీసుకురావడం కుటుంబ వ్యవస్థకు అవమానకరమని అన్నారు. ఇది వైఎస్ రాజకీయ వారసత్వానికి కూడా నష్టం కలిగించే అంశమని అభిప్రాయపడ్డారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ నెల 24న సీపీఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిన ఆందోళనల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు అద్దెను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

# పాలనలో ప్రతి నిర్ణయం భవిష్యత్తులో చరిత్ర

- ఐఎస్బీలో సీఎం చంద్రబాబు విజన్
- భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌కు రూపకల్పన

**ముద్ర, డెస్క్:**



హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపై విస్తృత దృష్టికోణాన్ని ఆవిష్కరించారు. పాలనలో తీసుకునే ప్రతి నిర్ణయం భవిష్యత్తులో చరిత్రగా నిలుస్తుందన్నారు. గతంలో ఐటీ, ఫార్మా, మౌలిక వసతుల రంగాల్లో చేపట్టిన సంస్కరణలే హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఎకోసిస్టంగా తీర్చిదిద్దాయన్నారు. హైదరాబాద్ అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యపడలేదని, దీని వెనుక దీర్ఘకాలిక ప్రణాళికలు, కఠినమైన నిర్ణయాలు అమలయ్యాయని ఆయన గుర్తుచేశారు. తాను సెల్‌ఫోన్, టెక్నాలజీ గురించి మాట్లాడినప్పుడు విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, అదే ఇప్పుడు ఫలితాలనిచ్చిందన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున భూమి లభ్యం కాకపోవడంతో అమరావతి కోసం ల్యాండ్ పూలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. అమరావతి నిర్మాణాన్ని గత పాలకులు నిలిపివేసి విమర్శలు చేసినా, ఇప్పుడు మళ్లీ పునర్నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో హైదరాబాద్‌కు అదనంగా అమరావతి కూడా అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుందన్నారు. టెక్నాలజీ ఆధారంగా స్మార్ట్ సిటీగా, బ్లూగ్రీన్ కాన్సెప్ట్‌తో రాజధాని నిర్మాణం జరుగుతోందని ఆయన వివరించారు. అంతేకాకుండా పోలవరం ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి అత్యంత కీలకంగా అభివర్ణిస్తూ, గోదావరి వరదలను నియంత్రించగల సామర్థ్యంతో నిర్మాణం జరుగుతోందన్నారు. గతంలో 72 శాతం పనులు పూర్తయ్యాయని, తరువాత నిర్లక్ష్యంతో నష్టం జరిగిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ప్రారంభం కానుందని, విశాఖలో గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు డేటా సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2047 నాటికి "స్వర్ణాంధ్ర" లక్ష్యంగా రాష్ట్రానికి విజన్ రూపొందించామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం సమతుల్యంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఉద్యాన, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దేశంలో అగ్రస్థానానికి తీసుకెళ్లే లక్ష్యంతో 15 శాతం స్థిరమైన వృద్ధి రేటును సాధించే దిశగా కార్యాచరణ కొనసాగుతోందని సీఎం స్పష్టం చేశారు.



## ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరు మృతి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

గద్వాల రాయిచూర్ జాతీయ రహదారి మార్గంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం దేవునిపల్లి గ్రామానికి చెందిన ఉల్లిగప్ప (40), తిమ్మప్ప(38)లు ఐజ నుంచి బైక్ పై తమ సొంత గ్రామం దేవునిపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బలిగెర గ్రామ శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్ ను బైక్ ఢీ కొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. గట్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జగన్ తో మళ్లీ చేయి కలపనున్న పీకే?



ఏపీ పాలిటిక్స్ అంటేనే ఎపుడూ సంచలనంగానే ఉంటుంది. ఎన్నికలు ఉన్నా లేకపోయినా ఆ మంట అలా మండుతూనే ఉంటుంది. ఇదిలా ఉంటే 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే గెలిచి విపక్ష హోదా సైతం అందుకోలేనంతగా వైసీపీ చతికిలపడిపోయింది. ఇక వైసీపీ ఓటమి మూటకట్టుకుని రెండేళ్లకు దగ్గర కావస్తోంది. ఎన్నికలు మరో మూడేళ్లలో ఉన్నాయి. అయితే వైసీపీని పునర్నిర్మించుకోవాల్సి ఉంది. అలాగే జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే పాదయాత్రకు తగిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించాల్సి ఉంది. ఆ మీదట జనంలోకి వెళ్ళేటప్పుడు వారి మనసుల్లోకి చొచ్చుకుని పోయే స్లోగన్స్ అవసరం. జనాల అవసరాలను చూడాలి. కొత్త హామీలు ఇవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఏమి చేసింది? ఏమి చేయలేదు? అన్నది చూసుకుంటూ వైసీపీ సరికొత్త రకమైన ఆల్టర్నేటివ్ పొలిటికల్ లాజిక్ తో ముందుకు సాగాల్సి ఉంటుంది.

ఇక వైసీపీ 2019 ఎన్నికల ముందు రెండేళ్లకు అంటే 2017లో ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్ ను తీసుకొని వచ్చింది. పీకే అప్పుడు నవరత్నాల వంటి పథకాలను రూపొందించారు. ఆనాటి టీడీపీ ప్రభుత్వం మీద పదునైన విమర్శలు చేయడమే కాకుండా ఆ పార్టీ బలాలను, బలహీనతలను గుర్తించి మరీ వైసీపీని అప్రమత్తం చేశారు. ఇక టీడీపీ నాడు ఆశ్రిత పక్షపాతంతో వ్యవహరించిందని కూడా పీకే తన వ్యూహాలతో వైసీపీకి ఆయుధాలు అందించి అధికారం పక్షాన్ని జనంలో పలుచన చేయించారు. మొత్తానికి అన్నీ ఫలించి వైసీపీ 151 సీట్లతో బంపర్ విక్టరీ కొట్టింది. అయితే 2024 నాటికి వైసీపీ పీకేని దూరం పెట్టి ఐ ప్యాక్ టీం తో ముందుకు సాగింది. అయితే అనూహ్యమైన పరాజయం పాలయింది. ఐ ప్యాక్ టీం వైసీపీని దెబ్బ తీసింది అన్న ఆగ్రహం అయితే పార్టీలో ఉంది. దీంతో 2029 ఎన్నికలకు మూడేళ్ల ముందు నుంచి కొత్త ఎన్నికల వ్యూహకర్తల అవసరాన్ని గుర్తించి వైసీపీ అధినాయకత్వం ఆ దిశగా అన్వేషణ చేస్తోందని ప్రచారం సాగుతోంది. ఇక దేశంలో రాజకీయ వ్యూహకర్తలు చాలా మంది ఉన్నారు. అయితే పీకే మీదనే వైసీపీ ఎక్కువగా మొగ్గు చూపిస్తోంని అంటున్నారు. ఎందుకంటే ఆయన ఒకసారి భారీ సక్సెస్ ని ఇచ్చిన సెంటిమెంట్ ఉంది. దాంతో మరోసారి ఆయనతోనే కలసి ముందుకు సాగితే 2029 లో మంచి ఫలితాలు వస్తాయని వైసీపీ అధినాయకత్వం ఊహిస్తోంని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే పీకే 2024 ఎన్నికల ముందు టీడీపీకి కొన్ని రకాలైన వ్యూహాలను అందించడమే కాకుండా సలహాలు ఇచ్చినట్టు చెబుతారు. అయితే ఆయన బీహార్ లో పార్టీ పెట్టి గత ఏడాది జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. అయితే పీకే పార్టీ అధినేతగా ఓటమి పాలు కావచ్చు కానీ వ్యూహకర్తగా సక్సెస్ అని వైసీపీ నమ్ముతోంది అంటున్నారు. ఇక వైసీపీ ఈ విషయంలో ఇప్పటికే పీకేతో సంప్రదింపులు మొదలెట్టిందని ప్రచారం సాగుతోంది. అన్నీ అనుకున్నట్లుగా కుదిరితే మాత్రం కచ్చితంగా వచ్చే ఎన్నికల కోసం తొందరలోనే జగన్ తో పీకే చేతులు కలుపొచ్చు అని అంటున్నారు. వైసీపీ భారీ ఎత్తున ప్లీనరీ సమావేశం నిర్వహించాలని చూస్తోంది. అది ఈ ఏడాదా లేక వచ్చే ఏడాదా అన్నది తెలియదు. ఎపుడు ప్లీనరీ నిర్వహించినా అందులోనే పీకే గురించి పార్టీ జనాలకు పరిచయం చేయాలని అధినాయకత్వం భావిస్తోంది అని కూడా అంటున్నారు. ఈ ప్రచారంలో వాస్తవం ఏ మేరకు ఉందో చూడాలి మరి.

– కనపర్తి రవి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



కారు డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించండి

ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చు



# ఐపీఎల్ 2021 ఆగిపోవడానికి నన్నే కారణమన్నారు: వరుణ్ చక్రవర్తి



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

కొవిడ్ పరిస్థితుల మధ్య అత్యంత కట్టుదిట్టమైన బయోబబుల్ నిబంధనలతో ప్రారంభమైన ఐపీఎల్ 2021 సీజన్ మధ్యలోనే నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కొంతకాలం మ్యాచ్‌లు సజావుగా జరిగినప్పటికీ, ఇద్దరు ఆటగాళ్లకు కొవిడ్ సోకడంతో టోర్నీని వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ సమయంలో ఈ పరిణామానికి తానే కారణమన్న ఆరోపణలు ఎదుర్కొన్నానని వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు.

భుజం నొప్పితో బాధపడుతున్న సమయంలో స్కానింగ్ కోసం బయోబబుల్ బయటకు వెళ్లిన తర్వాత తనకు కొవిడ్ సోకిందని వరుణ్ తెలిపాడు. అతడితో పాటు సందీప్ వారియర్‌కు కూడా వైరస్ నిర్ధారణ కావడంతో భద్రతా కారణాల వల్ల మ్యాచ్‌లను తాత్కాలికంగా నిలిపివేశారు.

తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 2021 సీజన్ తన కెరీర్‌లో అత్యంత కఠినమైన దశగా మిగిలిపోయిందని వరుణ్ వివరించాడు. పాజిటివ్ వచ్చిన తొలి ఆటగాడిగా నిలవడంతో అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని చెప్పాడు. లీగ్ ఆగిపోవడంతో కొంతమంది తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, తనను బాధ్యుడిగా నిలబెట్టారని పేర్కొన్నాడు. తనపై అనుచిత వ్యాఖ్యలు కూడా వచ్చినట్లు వెల్లడించాడు.

ఈ ఘటన వరుణ్, సందీప్ వారియర్‌కే పరిమితం కాలేదు. ఇతర జట్లలో కూడా కొవిడ్ వ్యాప్తి చోటుచేసుకుంది. సీఎస్‌కే శిబిరంలో బౌలింగ్ కోచ్ లక్ష్మీపతి బాలాజీ, సీఈవో కాశీ విశ్వనాథన్ వైరస్ బారిన పడగా, దిల్లీ జట్టు ఆటగాళ్లు క్వారంటైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పరిస్థితులు తీవ్రతరమవడంతో టోర్నీని నిలిపివేసిన బీసీసీఐ, తరువాత యూఏఈలో మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించింది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 15 వరకు రెండో దశ మ్యాచ్‌లు నిర్వహించి సీజన్‌ను పూర్తి చేసింది.



# ట్రోఫీపై ఢిల్లీ కన్ను..



- **ఈసారి చరిత్ర సృష్టిస్తుందా?**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

అన్ని విభాగాల్లో ప్రతిభావంతమైన ఆటగాళ్లు, సమర్థమైన మేనేజ్‌మెంట్ ఉన్నప్పటికీ ఐపీఎల్ చరిత్రలో ఢిల్లీ జట్టు ఇప్పటికీ టైటిల్‌ను అందుకోలేకపోయింది. ఇప్పటివరకు జరిగిన 18 సీజన్లలో ఒక్కసారి కూడా ట్రోఫీని గెలవలేకపోయిన ఈ జట్టు, 2020 సీజన్‌లో మాత్రమే ఫైనల్ దాకా చేరి నిలిచిపోయింది. మంచి ఆటగాళ్లు ఉన్నా స్థిరమైన ప్రదర్శన లేకపోవడం ఢిల్లీ జట్టుకు ప్రధాన సమస్యగా మారింది.

***గట్టి పోటీ ఇస్తుందా?***

ఐపీఎల్‌లో ఇప్పటివరకు జరిగిన 18 సీజన్లలో ఢిల్లీ జట్టు కేవలం ఆరుసార్లు మాత్రమే లీగ్ దశను దాటి ముందుకు వెళ్లగలిగింది. 2019 నుంచి 2021 వరకు వరుసగా మూడుసార్లు ప్లే ఆఫ్స్‌కు చేరుకున్నప్పటికీ కీలక మ్యాచ్‌ల ఒత్తిడిని తట్టుకోలేక మధ్యలోనే నిష్క్రమించింది. గత నాలుగు సీజన్లలో జట్టు ప్రదర్శన మరింత తగ్గింది. ప్లే ఆఫ్స్‌కు చేరడమే కాకుండా, టైటిల్ పోటీకి దూరంగా నిలిచింది. ప్రస్తుతం అక్షర్ పటేల్ నాయకత్వంలో ఉన్న ఈ జట్టు ఈసారి ప్రత్యర్థులకు ఎంతవరకు సవాల్ విసురుతుందో ఆసక్తిగా మారింది.

***గత సీజన్ మార్పులు***

గత ఏడాది ప్రారంభంలో వరుస విజయాలు సాధించిన ఢిల్లీ జట్టు తరువాత లయ కోల్పోయింది. వేలంలో పలు కీలక మార్పులు చేసింది. కొన్ని అనుభవజ్ఞులైన ఆటగాళ్లను విడుదల చేసి, డకెట్, డేవిడ్ మిల్లర్, నితీష్ రానా వంటి ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. ఈ సీజన్‌లో రాహుల్, అక్షర్ పటేల్, స్టబ్స్, కులదీప్ యాదవ్, స్టార్క్ వంటి ఆటగాళ్లు జట్టుకు ప్రధాన బలంగా కనిపిస్తున్నారు. ఏప్రిల్ 1న లక్నో జట్టుతో ఢిల్లీ తన తొలి మ్యాచ్ ఆడనుంది. హేమాంగ్ బదాని జట్టు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

***జట్టు బలం ఇదే***

ఈ సీజన్‌లో పృథ్వీ షా తిరిగి అందుబాటులోకి రావడం ఢిల్లీ జట్టుకు ఊరటగా మారింది. మూడో స్థానంలో కేఎల్ రాహుల్, మధ్య వరుసలో మిల్లర్, స్టబ్స్, రానా వంటి ఆటగాళ్లు బలంగా నిలుస్తున్నారు. అయితే ఈ జట్టుకు బ్యాటింగ్ కంటే బౌలింగ్ విభాగమే ప్రధాన బలంగా కనిపిస్తోంది. స్టార్క్, కులదీప్ యాదవ్, ఎంగిడి, నటరాజన్ వంటి బౌలర్లు మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థ్యం కలిగినవారు. వీరికి తోడు యువ బౌలర్ అఖిబ్ నబి కూడా ఈ సీజన్‌లో కీలక పాత్ర పోషించే అవకాశముంది. అతడిని వేలంలో భారీ మొత్తానికి కొనుగోలు చేయడం జట్టు నమ్మకాన్ని సూచిస్తోంది.

***ఇవి బలహీనతలు***

ఢిల్లీ జట్టులో ఓపెనింగ్ జోడీ తరచూ మారడం పెద్ద సమస్యగా మారింది. గత సీజన్‌లో ఈ ప్రయోగాలు ప్రతికూల ఫలితాలను ఇచ్చాయి. పృథ్వీ షా, డకెట్, నిశాంక వంటి ఆటగాళ్లు స్థిరమైన ఫామ్‌లో లేకపోవడం జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా స్టార్క్, ఎంగిడి బౌలింగ్‌లో ప్రభావం చూపకపోతే జట్టుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. చివరి ఓవర్లలో పరుగులను అదుపులో పెట్టలేకపోవడం, బ్యాటింగ్‌లో వేగం తగ్గడం గతంలో ఢిల్లీ జట్టుకు నష్టాన్ని కలిగించాయి. ఈ లోపాలను సరిదిద్దితేనే టైటిల్ పోరులో నిలిచే అవకాశం ఉంటుంది.

***ఇండియన్ ప్లేయర్లు***

కులదీప్ యాదవ్, కేఎల్ రాహుల్, కరుణ్ నాయక్, ముఖేష్ కుమార్, నటరాజన్, నితీష్ రానా, అఖిబ్ నబి, సాహిల్ ప్రకాష్, పృథ్వీ షా, అభిషేక్ పోరల్, అక్షర్ పటేల్, సమీర్ రిత్వి, విప్రజ్, ఆశుతోష్, విజయ్, మాధవ్, నితీష్

***ఫారిన్ ప్లేయర్లు***

డేవిడ్ మిల్లర్, జమీసన్, ఎంగిడి, డకెట్, నిశాంక, చమీరా, స్టార్క్

2020 సీజన్‌లో ఫైనల్ దాకా వెళ్లి ట్రోఫీకి ఒక్క అడుగు దూరంలో ఆగిపోయిన ఢిల్లీ జట్టు, ఈసారి ఆ లోటును తీర్చుకుంటుందా అనే ప్రశ్న అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ సీజన్‌లో జట్టు ప్రదర్శనే టైటిల్ కల నిజమవుతుందా లేదా అన్నది నిర్ణయించనుంది.

# ఫార్ములా వన్‌లో దూసుకెళ్తున్న 11 ఏళ్ల చిన్నది..



- **అతికా మిర్ ప్రతిభకు ప్రశంసలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**


ఫార్ములా వన్ రేసింగ్ ప్రపంచం ఎన్నో దిగ్గజ డ్రైవర్లను వెలుగులోకి తీసుకొచ్చింది. మైకెల్ షుమాకర్, లూయిస్ హామిల్టన్, మాక్స్ వెర్‌స్టాపెన్ వంటి రేసర్లు ఈ క్రీడకు విశేష గుర్తింపు తీసుకువచ్చారు. ఇటీవలి కాలంలో భారత్‌లో కూడా ఫార్ములా వన్‌పై ఆసక్తి పెరుగుతుండగా, 11 ఏళ్ల చిన్నారి అతికా మిర్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధిస్తోంది.

చిన్న వయస్సులోనే రేసింగ్‌లో అడుగుపెట్టిన అతికా మిర్, మినీ విభాగం (8 నుంచి 12 ఏళ్లు) నుంచి జూనియర్ విభాగం (12 నుంచి 14 ఏళ్లు) వరకు వేగంగా ఎదిగింది. తన రేసింగ్ నైపుణ్యంతో పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకేసారి 40 వరకు కార్ట్‌లు పాల్గొనే రద్దీ గ్రిడ్‌లలో కూడా అనుభవజ్ఞులైన పురుష రేసర్లను వెనక్కి నెట్టడం ఆమె ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రస్తుతం భారత్ తరఫున అంతర్జాతీయ వేదికలపై మెరుగైన ప్రదర్శన ఇస్తున్న యువ కార్టర్లలో ఆమె ఒకరిగా గుర్తింపు పొందుతోంది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన అతికా మిర్ ప్రస్తుతం దుబాయ్‌లో నివసిస్తోంది. రేసింగ్ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆమె తండ్రి ఆసిర్ మిర్ భారత తొలి జాతీయ కార్టింగ్ చాంపియన్‌గా గుర్తింపు పొందాడు. నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన మాక్స్ వెర్‌స్టాపెన్‌ను తన ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతోంది. 2021లో అబుదాబిలో జరిగిన ఫార్ములా వన్ సీజన్ ఫైనల్లో లూయిస్ హామిల్టన్, మాక్స్ వెర్‌స్టాపెన్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరును చూసిన తర్వాత రేసింగ్‌పై తన ఆసక్తి పెరిగిందని అతికా తెలిపింది.

మోటార్ రేసింగ్‌లో సాధారణంగా పురుషుల ఆధిక్యం ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో కూడా నమ్మకం, ఆత్మవిశ్వాసంతో ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకుందని వెల్లడించింది. ట్రాక్‌పై ఎదురైన ఇబ్బందులు తనలో మరింత పట్టుదలను పెంచాయని, అబుదాబి గ్రాండ్ ప్రిక్స్‌ను చూసిన తర్వాతే రేసింగ్‌పై మక్కువ పెరిగిందని అతికా వివరించింది. చిన్న వయస్సులోనే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న ఆమెకు క్రీడా వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.



# ఒక్క పోస్టుతో రూమర్లకు చెక్ పెట్టిన కోహ్లీ



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమ్‌ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ లండన్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నాడనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మ్యాచ్‌లు ఉన్నప్పుడే భారత్‌కు వస్తున్నాడనే చర్చ మధ్య, ప్రస్తుతం ఐపీఎల్ కోసం బెంగళూరుకు చేరుకుని సాధనలో పాల్గొంటున్నాడు. ఈ నేపథ్యంలో కోహ్లీ మేనేజ్‌మెంట్ ఎదుట పలు డిమాండ్లు పెట్టాడంటూ సోషల్ మీడియాలో పలు రూమర్లు చక్కర్లు కొట్టాయి. ముఖ్యంగా బెంగళూరు నుంచి లండన్‌కు నేరుగా ఛార్టర్డ్ ఫ్లైట్ ఏర్పాటు చేయాలని కోరినట్లు ప్రచారం జరిగింది. అలాగే మ్యాచ్‌ల మధ్య ఎక్కువ విరామం ఉంటే లండన్‌కు వెళ్లి, తదుపరి మ్యాచ్‌కు ముందు మాత్రమే తిరిగి వస్తానని చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారాలపై విరాట్ కోహ్లీ తనదైన శైలిలో స్పందించాడు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టును తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ నవ్వుతున్న ఎమోజీలను జత చేశాడు. దీంతో తనపై ప్రచారం అవుతున్న వార్తలు పూర్తిగా ఆధారంలేనివని స్పష్టం చేశాడు. ఈ చర్యతో కోహ్లీపై వచ్చిన రూమర్లకు తెరపడింది. ప్రస్తుతం అతడు ఐపీఎల్ సీజన్ కోసం పూర్తిగా సాధనపై దృష్టి పెట్టినట్లు సమాచారం.

# ఖాళీ స్టేడియాల్లో పీఎస్ఎల్ మ్యాచ్‌లు



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు పాకిస్థాన్ సూపర్ లీగ్ (PSL)పై ప్రభావం చూపుతున్నాయి. మార్చి 26 నుంచి ప్రారంభం కానున్న PSL మ్యాచ్‌లు ప్రేక్షకులు లేకుండానే నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. యుద్ధ ప్రభావంతో చమురు కొరత, ఇంధన ధరలు పెరగడం వల్ల ప్రేక్షకుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (PCB) చైర్మన్ మోసిన్ నఖ్వీ అభిమానులకు క్షమాపణలు తెలిపారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో దేశంలో ఇంధన సంక్షోభం ఏర్పడిందని, ప్రజలు తమ ప్రయాణాలను పరిమితం చేసుకోవాలని ప్రభుత్వ సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని పరిస్థితులను సమీక్షించి, భద్రతా సంస్థలతో చర్చించిన తరువాతే ప్రేక్షకులు లేకుండా మ్యాచ్‌లు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రారంభ దశలో 10 నుంచి 15 రోజుల పాటు మ్యాచ్‌లు ఖాళీ స్టేడియాల్లోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడితే ఫైనల్ దశలో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. టోర్నీ మొత్తం లాహోర్, కరాచీ వేదికలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. చమురు సంక్షోభం కారణంగా ప్రారంభ వేడుకలను కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.03.2026
www.mudranews.in | @mudranews




కారుకు ఎమర్జెన్సీ కిట్ వెంట ఉంచండి
ఫస్ట్ ఎయిడ్, టార్చ్, టూల్ కిట్ ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుంది.




# రీ రిలీజ్‌ల హంగామా మళ్లీ మొదలు

## స్టార్ హీరోల సినిమాలు మరోసారి థియేటర్లలో







తెలుగు సినీ పరిశ్రమలో రీ రిలీజ్ ల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంది. గత కొంతకాలంగా స్టార్ హీరోల పాత హిట్ సినిమాలను ప్రత్యేక సందర్భాల్లో తిరిగి విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు నటించిన సినిమాలు మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాయి. అల్లు అర్జున్ నటించిన 'రేసుగుర్రం' చిత్రాన్ని ఆయన పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 7 నుంచి 12 వరకు ఓవర్సీస్ లో రీ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్రకటించారు. శృతిహాసన్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించగా, సంగీతాన్ని తమన్ అందించాడు. ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. అలాగే జూనియర్ ఎన్టీఆర్ హీరోగా, తమన్నా హీరోయిన్ గా తెరకెక్కిన 'ఊసరవెల్లి' సినిమాను కూడా మళ్లీ విడుదల చేయనున్నట్లు సమాచారం. తారక్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు కూడా సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఇక మహేష్ బాబు హీరోగా నటించిన 'అతిథి' సినిమాను కూడా రీ రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అమృతా రావు హీరోయిన్ గా నటించిన ఈ చిత్రాన్ని మే 29న మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. ఈ సినిమాకు కూడా సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించడం విశేషం. ఈ మూడు సినిమాలు ఒకే దర్శకుడి సినిమాలు కావడం ఆసక్తికరంగా మారింది. స్టార్ హీరోల సినిమాలు మళ్లీ థియేటర్లలోకి వస్తుండటంతో అభిమానుల్లో భారీగా ఆసక్తి పెరుగుతోంది

# 'ధురంధర్ 2' సునామీ!

## మూడే రోజుల్లో 500 కోట్లు!



బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన లేటెస్ట్ స్పై థ్రిల్లర్ ధురంధర్: ది రివెంజ్ బాక్సాఫీస్ వద్ద కనీవినీ ఎరుగని రీతిలో దూసుకుపోతోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా.. విడుదలైన మూడు రోజుల్లోనే గ్లోబల్ మార్కెట్ లో రూ. 500 కోట్ల మార్కును దాటేసి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. శనివారం ఒక్క రోజే ఇండియాలో భారీగా కలెక్షన్లు పెరగడం ఈ సినిమాకున్న క్రేజ్ ను స్పష్టం చేస్తోంది. సక్ నిల్క్ నివేదికల ప్రకారం.. ఈ చిత్రం శనివారం నాడు ఇండియాలో ఏకం గా రూ. 113 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టింది. దీంతో కేవలం మూడు రోజుల్లోనే దేశీయంగా మొత్తం వసూళ్లు రూ. 296.27 కోట్లకు చేరుకున్నాయి. గురువారం నాటికి రూ. 102.55 కోట్లు, శుక్రవారం నాటికి రూ. 80.72 కోట్లు, శనివారం రోజుకి రూ. 113.00 కోట్లు వసూళ్లు వచ్చాయి. మొత్తంగా రూ. 296.27 కోట్లు (నెట్) వసూలు చేసింది.కేవలం ఇండియాలోనే కాకుండా ఓవర్సీస్ లో కూడా ధురంధర్ 2 రికార్డులు సృష్టిస్తోంది. విదేశీ మార్కెట్లలో ఇప్పటివరకు రూ. 96.50 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం వసూళ్లు సుమారు రూ. 501.04 కోట్లకు చేరుకున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికా (యూఎస్ఏ, కెనడా)లో ఈ చిత్రం 4,405 షోలతో భారతీయ సినిమాల్లోనే అత్యధిక స్క్రీన్లలో విడుదలైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అక్కడ అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 23.70 కోట్లు రావడం విశేషం. యూకేలో కూడా బెల్ఫాస్ట్ వంటి నగరాల్లో ఒకే రోజు 7 షోలు హౌస్ ఫుల్ కావడం సినిమా డిమాండ్ ను తెలియజేస్తోంది.



# గోల్డెన్ లుక్ సంయుక్త మెరుపులు

దక్షిణాది హీరోయిన్ సంయుక్త మేనన్ ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన స్టైలిష్ లుక్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఓటీటీ వేదిక కోసం రూపొందించిన తన తొలి వెబ్ సిరీస్ 'గువ్వలచెరువు ఘాట్' లాంచ్ ఈవెంట్ కు ఆమె హాజరై ప్రత్యేకంగా మెరిసింది. సంప్రదాయ అందాన్ని ఆధునిక స్టైల్ తో మిళితం చేసిన ఆమె లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ ఈవెంట్ కు సమ్యుక్తా ధరించిన చీర ప్రత్యేకంగా నిలిచింది. మారూన్ కలర్ చీరపై గోల్డెన్ ఎంబ్రాయిడరీ ఆమె లుక్ కు రాయల్ టచ్ ఇచ్చింది. మిర్రర్ వర్క్ తో రూపొందించిన బ్లౌజ్ ఆమె స్టైల్ ను మరింత ఆకర్షణీయంగా మార్చింది. జుట్టును సింపుల్ గా బన్ గా కట్టుకుని, స్టేట్ మెంట్ ఇయరింగ్స్ తో పాటు మినిమల్ మేకప్ లో ఆమె చాలా క్లాసీగా కనిపించింది. సాధారణమైన స్టైల్ అయినా ఎంతో ఎలిగెంట్ గా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంది.ఈ వెబ్ సిరీస్ లో హీరోగా కిరణ్ అబ్బవరమ్ నటిస్తున్నాడు. ఇది ఆయనకు ఓటీటీ ప్రపంచంలో మొదటి ప్రాజెక్ట్ కావడం విశేషం. దర్శకుడు భరత్ కమ్మ ఈ సిరీస్ ను తెరకెక్కిస్తున్నారు. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాలు మంచి గుర్తింపు తెచ్చుకున్న నేపథ్యంలో ఈ సిరీస్ పై కూడా మంచి అంచనాలు ఉన్నాయి.రాయచోటీ నేపథ్యంలో సాగే ఈ కథలో ఒక రహస్య వారసుడు తన అసలు గుర్తింపును తిరిగి పొందేందుకు చేసే ప్రయత్నాలు ప్రధానాంశంగా ఉంటాయని తెలుస్తోంది. గ్రామీణ రాజకీయాలు, భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన కథనంతో ఈ సిరీస్ రూపొందిందని సమాచారం. విడుదలకు ముందే వచ్చిన గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది.మొత్తంగా చూస్తే, 'గువ్వలచెరువు ఘాట్' సిరీస్ తో పాటు సమ్యుక్తా మేనన్ స్టైలిష్ లుక్ కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ సిరీస్ విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

# బ్రేక్ కోసం అశికా ఎదురుచూపులు

అశికా రంగనాథ్ తన అందం, స్టైలిష్ లుక్ తో మళ్లీ వార్తల్లో నిలిచింది. కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో అవకాశాలు వస్తున్నప్పటికీ ఆమెకు ఇప్పటికీ ఒక భారీ బ్రేక్ రావాల్సి ఉందనే చర్చ సినీ వర్గాల్లో కొనసాగుతోంది. 2016లో 'క్రేజీ బాయ్' సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టిన అశికా, తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించింది.

బెంగళూరు టైమ్స్ మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ జాబితాలో కూడా ఆమె పేరు వరుసగా చోటు సంపాదించింది. సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉన్నా, పెద్ద హిట్ కోసం ఆమె ఇంకా ఎదురుచూస్తోంది. అయితే త్వరలో విడుదల కానున్న 'విశ్వంభర', 'సర్దార్ 2' వంటి సినిమాలపై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రాలు ఆమె కెరీర్ కు మలుపు తిప్పే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. ఇటీవల అశికా చేసిన ఫోటోషూట్ లో ఆమె గోల్డెన్ చీరలో అద్భుతంగా కని పించింది. సాఫ్ట్ గోల్డెన్ కలర్ చీరపై మెరిసే డిజైన్ ఆమె లుక్ కు రాయల్ టచ్ ఇచ్చింది. హెవీ వర్క్ ఉన్న బ్లౌజ్ తో ఆమె స్టైల్ మరింత ఆక ర్షణీయంగా మారింది. సైడ్ గా వేవీ హెయిర్, సింపుల్ మేకప్, మిని మల్ ఆభరణాలతో ఆమె చాలా క్లాసీగా కనిపించింది. ఫోటోషూట్ లో ఉప యోగించిన లైటింగ్ , ఎర్తీ బ్యాక్ గ్రౌండ్ ఆమె లుక్ ను మరింత హైలైట్ చేశాయి. గోల్డెన్ షేడ్ లో కనిపించిన ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతు న్నా యి. అం దం, కాన్ఫి డెన్స్, ఎలిగెన్స్ కలిసిన ఈ లుక్ అభిమానులను ఆట్టుకుంటోంది.

# "ఆదిత్య ధర్‌కు హ్యాట్సాఫ్"

## ధురంధర్ దర్శకుడికి కంగనా ప్రశంసలు

బాలీవుడ్ నటి కంగ నా తాజాగా దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసలు కురిపించారు. 'ధురంధర్ ది రివెంజ్' సినిమాను ఆయన తెరకెక్కించిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ సినిమా విజయంతో దర్శకుడిగా ఆదిత్య ధర్ ప్రత్యేక గుర్తింపు సంపాదించారని కంగనా అభిప్రాయపడ్డారు.

ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో స్పందించిన కంగనా, ఆదిత్య ధర్ కేవలం మంచి దర్శకుడే కాకుండా యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని చెప్పారు. సినిమాను ప్రేక్షకులకు నచ్చేలా రూపొందించడంలో ఆయన చూపిన ప్రతిభ నిజంగా అభినందనీయం అని ఆమె వ్యాఖ్యానించారు. అందుకే "ఆదిత్య ధర్ కు హ్యాట్సాఫ్ " అంటూ తన పోస్ట్ లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. సినిమా విజయానికి నటులే కాదు, దర్శకుడి ఆలోచన కూడా ఎంతో కీలకమని కంగనా పేర్కొన్నారు. ముఖ్యంగా 'ధురంధర్ ' లాంటి చిత్రంతో ఆదిత్య ధర్ దర్శకుల ప్రాధాన్యాన్ని మరోసారి చాటిచెప్పారని ఆమె అన్నారు. దర్శకుడు కూడా స్టార్ గా నిలవగలడని ఆయన నిరూపించారని అభిప్రాయపడ్డారు. ఇండస్ట్రీలోకి రావాలని కలలు కనే యువతకు ఆదిత్య ధర్ స్ఫూర్తిగా నిలుస్తారని కంగనా పేర్కొన్నారు. ఆయన విజయం మరింత మంది యువతను దర్శకత్వం, కథా రచన వంటి రంగాల వైపు ఆకర్షిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

చివరిగా, ఆదిత్య ధర్ చేసిన కృషి ప్రశంసనీయం అని చెప్పిన కంగనా, ఆయనలాంటి దర్శకులు పెరిగితే భారత చిత్రపరిశ్రమ మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఆయన ప్రతిభకు సెల్యూట్ అంటూ కంగనా తన అభినందనలు తెలియజేశారు





# ఏఏ22ఎక్స్‌ఏ6లో అనుష్కశర్మ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కుమార్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ సినిమా ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచింది. ఈ చిత్రానికి ఇంకా అధికారిక టైటిల్ ను ప్రకటించకపోయినా 'AA22 X A6' అనే వర్కింగ్ టైటిల్ తో మేకర్స్ ప్రాజెక్ట్ ను ప్రకటించారు. అనౌన్స్మెంట్ జరిగినప్పటి నుంచే ఈ సినిమాపై భారీ హైప్ కొనసాగుతోంది.

సినిమా ప్రకటించిన సమయంలో విడుదల చేసిన వీడియో హాలీవుడ్ స్థాయిలో ఉండటంతో అభిమానులు మరింత ఆసక్తి చూపించారు. ఆ తరువాత హీరోయిన్ గా దీపిక పదుకొనే నటించనున్నట్లు ప్రకటిస్తూ విడుదల చేసిన స్పెషల్ వీడియో కూడా మంచి స్పందన అందుకుంది. ఈ సినిమా ద్వారా అల్లు అర్జున్ – అట్లీ జోడీ అంతర్జాతీయ మార్కెట్ ను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



ఇప్పటికే ఈ సినిమాలో రష్మిక మందన, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి హీరోయిన్లు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ కూడా చేరబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె ఈ ప్రాజెక్ట్ తో మళ్లీ కమ్ బ్యాక్ ఇవ్వబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. మరోవైపు ఈ సినిమాకు సంబంధించిన టీజర్ ను ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా నుంచి టీజర్ వస్తే హైప్ మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com